


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 11-10-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 28 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### అధికారం ఉంది కదాని..

# విర్రవీగొద్దు



- మోదీ కంటే నేనే సీనియర్‌ని
- జగన్, పవన్.. మోదీ చెప్పినట్లు వింటున్నారు
- తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది
- విలువల పాటిస్తూ పద్ధతిగా ఉండాలి
- అనంతపురం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

భైరవానితిప్ప: అధికారంలో ఉన్నాం కదా అని విర్రవీగితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు అందించే కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం అనంతపురం జిల్లాలో పర్యటించారు. బుధవారం ఉదయం గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి చేరుకున్న సీఎం... అక్కడి నుంచి హెలికాప్టర్లో గుమ్మఘట్ట మండలానికి చేరుకున్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టు వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి బీటీ ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు పైలాన్ ఆవిష్కరించారు. ఆ తరువాత దేశంలో ఎక్కడా లేని విధంగా లక్ష నీటి కుంటలు జిల్లాలో పూర్తైన సందర్భంగా లక్షవ నీటి కుంటను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. అనంతపురం


తరువాయి 2లో..

### అతి తీవ్ర తుపానుగా

# బలహీనపడిన 'తిత్లీ'

- కళింగపట్నం, భీమునిపట్నం రేవుల్లో ఏడో నంబర్
- విశాఖ, గంగవరం రేవుల్లో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ
- కళింగపట్నం- గోపాల్‌పూర్ మధ్య తుపాను తీరం దాటే అవకాశం

విశాఖపట్నం: కోస్తాంధ్ర, ఒడిశాను తిత్లీ తుపాను వణికిస్తోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఈ తుపాను అతి తీవ్ర తుపానుగా బలపడింది. దీంతో కళింగపట్నం, భీమునిపట్నం ఓడరేవుల్లో ఏడో నంబర్.. విశాఖ, గంగవరం ఓడరేవుల్లో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరికలను జారీ చేశారు. తిత్లీ తుపాను కళింగపట్నానికి 230కి.మీ, గోపాల్‌పూర్‌కు 280 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. నేటి ఉదయం



కళింగపట్నం- గోపాల్‌పూర్ మధ్య తుపాను తీరం దాటే అవకాశముంది. దీని ప్రభావంతో ఉత్తర

తరువాయి 2లో..

# బాబుది 'చెత్త' పాలన

- ఉత్తమ చెత్త సీఎం అవార్డు ఇవ్వాలి
- తోటపల్లి పూర్తయ్యేనా... ?
- 100 పడకలకు పెంచే హామీ ఏమైంది..?
- 108 వాహనాల కొనుగోలులో అవినీతి
- వైఎస్ జగన్మోహన్ రెడ్డి



గజపతినగరం (విజయనగరం) : గత వారం రోజులుగా మున్సిపాలిటీల్లో చెత్త పేరుకు పోయి, విష జ్వరాలు వ్యాపిస్తున్నా పట్టించుకోని చంద్రబాబు నాయుడికి ఉత్తమ చెత్త ముఖ్యమంత్రి అవార్డు ఇవ్వాలి అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఆయన చెత్త పాలనకు ఆ అవార్డే సరైందని ఎద్దేవా చేశారు. 283వ రోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా గజపతినగరం బహిరంగ సభలో అశేష జనవాహినిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సభలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**తోటపల్లి పూర్తయ్యేనా... ?**

గజపతినగరంలో తిరుగుతున్నపుడు రైతన్నలు తనని కలిసి అర్జీలు ఇచ్చారన్న వైఎస్ జగన్.. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కంటే ముందు తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ఏనాడు తోటపల్లి ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. పాదయాత్రలో భాగంగా విజయనగరం జిల్లాను సందర్శించిన రాజన్న.. అధికారంలోకి వచ్చాక తోటపల్లి ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించారని గుర్తు చేశారు. ఆయన హాయంలోనే ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని... కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లైనా మిగిలిన 10 శాతం పనులు పూర్తి కాలేదని విమర్శించారు. రైతుల బాగోగులు పట్టించుకోకుండా చంద్రబాబు గాడిద పళ్లు తోముతున్నారా అంటూ జగన్ ఎద్దేవా చేశారు. 20 మండలాల్లో లక్షా ముప్పై ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా పనుల జాప్యం వల్ల కేవలం ఎనభై వేల ఎకరాలకు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ హయాంలో బ్రాంచు కెనాల్‌కు 12 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 25 శాతం పనులు పూర్తి చేస్తే.. చంద్రబాబు 9 కోట్లు ఖర్చు చేసి చేతులు దులుపుకొన్నారన్నారు. ఇలా అయితే తోటపల్లి ఎప్పుడు పూర్తవుతుందని జగన్ ప్రశ్నించారు.

**100 పడకలకు పెంచే హామీ ఏమైంది..?**

ఆరుగురు డాక్టర్లు ఉండాల్సిన సామాజిక ఆస్పత్రిలో కేవలం నలుగురు మాత్రమే ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని జగన్ అన్నారు. అధికారంలోకి వస్తే 100 పడకలకు పెంచుతామన్న బాబు

తరువాయి 7లో..



# కిడారి మృతి పార్టీకి తీరని లోటు

- టీడీపీ మీ కుటుంబానికి అండగా ఉంటుంది
- కిడారి కుటుంబానికి మంత్రి లోకేష్ పరామర్శ

అరకు : మావోయిస్టుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు కుటుంబాన్ని మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. బుధవారం ఉదయం విశాఖ నుంచి మంత్రి పాడేరు చేరుకున్నారు. కిడారి ఇంటికి వెళ్లిన లోకేష్.. ఆయన ఫొటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సర్వేశ్వరరావు కుటుంబ సభ్యుల్ని కలిసి పరామర్శించారు. టీడీపీ కుటుంబానికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కిడారి

తరువాయి 2లో..

# సుప్రీంలో 'రఫేల్'



- వివరాలు సీల్డ్‌కవర్‌లో ఇవ్వండి
- కేంద్రానికి సుప్రీం తాఖీదు

దిల్లీ: వివాదాస్పదంగా మారిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు అంశంపై ఈరోజు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. రఫేల్ ఒప్పందానికి సంబంధించిన వివరాలు, ఈ ఒప్పందం కుదుర్చుకోవడంపై నిర్ణయం తీసుకున్న ప్రక్రియ గురించి వివరాలను సీల్డ్ కవర్‌లో అందజేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే విమానాల ధర, సాంకేతిక అంశాలకు సంబంధించిన వివరాలు అవసరం లేదని కోర్టు వెల్లడించింది. అక్టోబరు 29లోగా

తరువాయి 2లో..

### ఆ ఐదు స్థానాలకు

# ఉప ఎన్నిక ఎందుకు రాలేదు?

- వైసీపీ ఎంపీల రాజీనామాలు డ్రామాలే..
- వైసీపీ-బీజేపీ మధ్య కుమ్మక్కు రాజకీయం బయటపడింది
- ఏపీ మంత్రి యనమల రామకృష్ణుడు



అమరావతి: బీజేపీ-వైసీపీ మధ్య కుమ్మక్కు రాజకీయం జరుగుతోందన్నారు ఏపీ మంత్రి యనమల రామకృష్ణుడు. అమరావతిలో మాట్లాడిన మంత్రి.. వైసీపీ అధినేత జగన్ తీరుపై మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసిన స్థానాలకు ఉప ఎన్నికలు ఎందుకు రాలేదో జగన్ చెప్పాలన్నారు యనమల. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష నేత ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వైసీపీ ఎంపీలకంటే ముందే కర్ణాటకలో ముగ్గురు ఎంపీలు రాజీనామాలు చేశారని.. ఆ స్థానాలకు ఉప ఎన్నికలు వచ్చినా.. ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. ఏపీలో వైసీపీ ఎంపీల రాజీనామాలు డ్రామాలేనన్నారు మంత్రి. ఈ ఐదు స్థానాలకు ఉపఎన్నికలు

తరువాయి 2లో..

### తెలంగాణలో మతపరమైన

# రిజర్వేషన్లను అడ్డుకుంటాం

**బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా**



హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో... బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మతపరమైన రిజర్వేషన్లను అడ్డుకుంటా మని అన్నారు. కేసీఆర్ అసెంబ్లీని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు ఎందుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ హవాలో కొట్టుకుపోతాననే భయంతోనే కేసీఆర్ ముందస్తుకు వెళ్లారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తన కొడుకు, కూతురునో సీఎం చేసుకోవాలని ఆశపడుతున్నారని, ఆయన ఆశలు నెరవేరవని అమిత్‌షా అన్నారు.

ముందస్తు ఎన్నికలతో ప్రజలపై పడుతున్న ఆర్థిక భారానికి కేసీఆర్ ఏం సమాధానం చెబుతారని అమిత్ షా ప్రశ్నించారు. కేసీఆర్ చెబుతున్న ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ లతో బీసీలు నష్టపోతారని అన్నారు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లను అడ్డుకుంటామని అమిత్ షా


తరువాయి 2లో..

# రైల్వే ఉద్యోగులకు పండగ శుభవార్త !

దిల్లీ: దసరా పండగ సందర్భంగా రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురును అందించింది. దసరా సందర్భంగా ఈ ఏడాది కూడా 78 రోజులకు బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను రైల్వే ఉద్యోగులకు ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ (పీఎల్‌బీ) 78 రోజులకు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్ బుధవారం వెల్లడించారు. నాన్ గెజిట్ రైల్వే ఉద్యోగులకు మాత్రమే ఈ బోనస్ లభించనుంది. దీని కింద ఉద్యోగులు తమ వేతనంతో పాటు సుమారు రూ.18వేలు అదనంగా బోనస్ కింద పొందనున్నారు.

పీఎల్‌బీ బోనస్ కింద సుమారు 12.26లక్షల మంది రైల్వే ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్‌ఎఫ్) ఉద్యోగులకు ఇది వర్తించదు. ఈ బోనస్ వల్ల దాదాపు రూ.2వేల కోట్ల మేర ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడనుంది. గత ఆరేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వం రైల్వే ఉద్యోగులకు దసరా సందర్భంగా 78రోజుల పీఎల్‌బీని బోనస్‌గా ఇస్తూ వస్తోంది.

# తీవ్రవాద ఉద్యమాలు వస్తాయి : పవన్



ఏలూరు: ప్రత్యేకహోదాపై తాను ఎప్పుడూ ఒకే మాటపై ఉన్నానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే... ప్రజా ఉద్యమాలు, తీవ్రవాద ఉద్యమాలు వస్తాయని జోస్యం చెప్పారు. ప్రభుత్వానికి ఇసుక రవాణాపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని ఆరోపించారు. టీడీపీ నేతలు కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని, మోదీకి, అమిత్‌షాకు సీఎం చంద్రబాబు భయపడుతున్నారని పవన్ విమర్శించారు.



# ప్రభుత్వానికి ప్రజలకు వారధి సమాచారశాఖ

## పరిపాలనా కార్యదర్శి బి.రామాంజనేయులు



విశాఖపట్నం : సమాచార పౌర సంబంధాల శాఖ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగాపనిచేయాలని ఆ శాఖ పరిపాలనా కార్యదర్శి బి. రామాంజ నేయులు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జూన్-1 సమాచార శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గూర్చి ప్రజలకు తెలియజెప్పడం, వారి సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడం చేయాలన్నారు. ప్రభుత్వానికి కళ్ళు చెవులుగా పని చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న సంక్షేమ పథకాల అమలుతీరును గూర్చి ప్రజాభిప్రాయ సేకరణ, వాటివల్ల ప్రయోజనం పొందిన వారి స్పందన, ప్రచార మాధ్యమాల ద్వారా అందరికీ తెలియజేయాలన్నారు. తప్పయినా ఒప్పయినా ఉన్నతాధికారులకు, మంత్రులకు నిర్మొహమాటంగా స్పష్టంగా తెలియజేయడం సమాచార శాఖ అధికారుల విధిగా ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజు వివిధ పత్రికల్లో వచ్చే వార్తలను కథనాలను వ్యాసాల సారాంశాన్ని కలెక్టర్లకు తెలియజేయాలన్నారు. సమాచార అధికారుల ఉద్యోగ బాధ్యతలు కత్తి మీద సాములా ఉంటాయన్నారు. మారుతున్న కాలంతోపాటు సాంకేతికతను ఉపయోగించుకుని వీలైనంత వేగంగా క్లుప్తంగా స్పష్టంగా సమా చారాన్ని అందించాలన్నారు. రూపవ్యం, శాప్ నెట్, vims, rtg, సామాజిక మాధ్యమం మొదలైన వాటినన్నింటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జోన్ ఒకటి సంయుక్త సంచాలకులు యం బాలగంగాధర్ తిలక్, ప్రాంతీయ సమాచార ఇంజనీరు పి. శ్రీధర్ రెడ్డి విజయనగరం జిల్లా సహాయ సంచాలకులు డి నాగార్జున, ఉప సమాచార ఇంజనీర్లు జవాబు మహేశ్వర రావు, రాంప్రసాద్, మల్లికార్జున రావు డిపిఆర్వో లు పి.గోవిందరాజులు, కె.సుమిత్రాదేవి, డి.సాయిబాబా ఏపిఆర్వోలు ఎస్ శ్రీనివాసరావు, ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎంవీవీఎస్ మూర్తి మృతి బాధాకరం

## మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు



విజయనగరం : ఎంవీవీఎస్ మూర్తి మృతి చాలా బాధాకరమని మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. ఎంవీవీఎస్ మూర్తి కుటుంబ సభ్యులను బుధవారం అశోక్ గజపతి రాజు దంపతులు పరామర్శించారు. ఈ సందర్భంగా మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ పార్టీ అంటే మూర్తికి ఎనలేని అభిమానమని, ఎన్టీఆర్ అంటే చాలా గౌరవమని తెలిపారు. మూర్తి ఉన్నత విలువలతో విద్యా సంస్థలను నడిపారన్నారు. ఏ పని చేపట్టినా అంకితభావంతో పనిచేసే వారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది టిడిపి నేతలని కోల్పోవడం కలసివేస్తోందన్నారు. రాజకీయ నేతగా, విద్యావేత్తగా, విద్యాదాతగా మూర్తి చెరగని ముద్ర వేసిన వ్యక్తి అని కొని యాడారు. ఆయన మరణం విద్యా రంగానికి, రాజకీయ రంగానికి తీరని లోటన్నారు.

వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సునీలా గజపతిరాజు, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొద్దల నర్సింగరావు, రాష్ట్రపార్టీ కార్యదర్శి ఎస్.ఎన్.ఎం రాజు, సాగి సీతారామరాజు (చంటి), కౌన్సిలర్లు మైలపల్లి పైడిరాజు, కోండ్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 14
# రాష్ట్ర స్థాయి కబడ్డి జట్టుకు ఎంపిక

రావికమతం : రావికమతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మరిశాస్వామి సిఎం కప్ అండర్ 14 కబడ్డీ రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న మరుపాక గ్రామానికి చెందిన మరిశా స్వామి గత నెలలో రావికమతం జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయిలో నిర్వహించిన సిఎం కప్ పోటీలకు హాజరై నియోజకవర్గ స్థాయి పోటీకి ఎంపికయ్యాడు. విశాఖ పోర్టు స్టేడియంలో సిఎం కప్ అండర్ 14 బాలుర కబడ్డి పోటీలు, రాష్ట్ర స్థాయి జట్టుకు క్రీడా కారుల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చోడవరం నియోజకవర్గం జట్టు ప్రథమ విజేతగా నిలిచింది. ఈ జట్టులో సభ్యుడిగా ఉన్న మరిశా స్వామిని సెలక్షన్ కమిటీ ప్రతిభ ఆధారంగా విశాఖజిల్లా తరపున రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేసిందని రావికమతం హైస్కూల్ పిఈటి ధనుంజయరావు చెప్పారు. స్వామిని హెచ్ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

# సిరి..'మాను' కోరడమే అదృష్టం
## -చినశ్రీను




విజయనగరం: ఉత్తరాంధ్రప్రజల ఆరాధ్యదేవత శ్రీపైడితల్లి అమ్మవారు ఉత్సవ సిరిమాను అమ్మవారు ఈ ప్రాంతంలో కోరు కోవడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయవ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు(చినశ్రీను) అన్నారు. బుధవారం బొండపల్లి మండలం కనిమెరక గ్రామంలో శ్రీపైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును దర్శించి, పూజలు చేశారు. పైడితల్లి అమ్మవారి దేవస్థానం అధి కారులు శ్రీనివాసరావును స్వాగతించి సిరిమాను చెట్టును గొడ్డలితో నరికించారు. మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ పైడితల్లి అమ్మవారు సకల జనులను చల్లగా కాపాడాలని ఆయన ప్రార్థించారు. ఈ సంద ర్భంగా చిన్నశ్రీనుతో పాటు, జిల్లా పార్టీ నాయకులు పిళ్ళా విజయ కుమార్, ఇందుకూరి రఘురాజు, వైసిపి విజయనగరం నియోజక వర్గం నాయకులు అవనాపు విక్రమ్, విజయ్‌లు కూడా సిరిమాను చెట్టుకు పూజలు చేసి గొడ్డలితో నరికారు.ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు గాడు అప్పారావు, మంచాల శివానీ, పిలకా శ్రీను, పొట్నూరు వెంకటి, పైలా పెద్ద, మామిడి వెంకటి, సుంకరి నారాయణరావు, విద్యార్థినాయకులు నేటిపల్లి పృధ్వి, దత్తి సోము తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సిరిమాను తరలింపు ఉత్సవం

విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, కోరికలు తీర్చేకొంగుబంగారం శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను తరలింపోత్సవం బుధ వారం మండలంలో కనిమెరక గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. విజయనగరం పూసపాటి వంశీయులు సుశీలాగజపతి ఉదయం సిరిమాను వెలసిన కనిమెరక గ్రామానికి మేలతాళాలతో సంస్కృతి సంప్ర దాయాల మధ్య పూజలు నిర్వహించి సిరి మానుపై గొడ్డలితో నాట్లు వేశారు. అనంతరం వేదమంత్రాల మధ్య సిరిమానును సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరమణ అమ్మవారి పూజా కార్యక్రమం చేపట్టారు. దీంతో వేలాది మంది భక్తులు సిరిమానుకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి నాటుబండిపై భారీ ఊరేగింపుగా అశేషభక్తజనుల మధ్య జాతీయ రహదారి మీదుగా బొండపల్లి, నెలివాడ, అంబటివలస, గొట్లాం, జెఎన్‌టియు మీదుగా రైల్వే స్టేషన్ నుండి హుక్కుంపేటకు తరించారు. ఈ సిరిమానుకు స్థానిక ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు, ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి, గాదె శ్రీనివాసుల నాయుడు, ఎజెసి-2 సీతా రామా రావు, డిఆర్వో వెంకటరావు, విజయనగరం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల రామకృష్ణ, ఎఎంసి చైర్మన్‌చంటిరాజు, ఐవిపి రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొద్దల నర్సింగరావు కర్రోతు నర్సింగరావు, ఎస్.ఎన్.ఎం.రాజు, డిఎఫ్ఓ లక్ష్మణరావు, రేంజర్ ఆఫీసర్ రాజబాబు, జడ్పీటీసీ బాలాజీ, తహశీల్దార్ శేఖర్, ఉప తహశీల్దార్ శ్రీనివాసరావు, సర్వేయర్ గణపతి రావు, ఆర్ఐ సత్యనారాయణ తదితరులు మొక్కలు చెల్లించుకున్నారు. కాగా వచ్చిన వేలాది మంది భక్తులకు గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ అల్లు అరుణ,శిరపరపు ఆదినారాయణ, పడాల అప్పలనాయుడు, అల్లు శ్రీనివాసరావు, బూర్లె అప్పలనాయుడు తదితరులు దాతల సహకారంతో భారీ అన్నసమారాధన చేపట్టారు.

# జాతీయ అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్



విజయనగరం : పోషణ్ అభియాన్ అమలులో జాతీయ అవార్డును జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ అందుకున్నారు. బుధవారం న్యూఢిల్లీ చైతన్యపురిలో గల అశోక్ హొటల్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో నీతి అయోగ్ వైస్ చైర్మన్ డా.రాజీవ్‌కుమార్, నీతి అయోగ్ మెంబరు డా.వినోద్ కుమార్ పాల్, మహిళా, శిశు అభివృద్ధి శాఖ సెక్రటరీ రాకేష్ శ్రీవాత్సవ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ అవార్డును అందుకున్నారు. పోషన్ అభియాన్‌పథకం అమలులో దేశంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంనకు ఎంపికైనందున జాతీయ స్థాయిలో అవార్డ పొందడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 36 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రాష్ట్రీయ పోషన్ మహాగా జరుపుటకు నిర్ణయించి సెప్టెంబర్ మాసాన్ని పోషన్ మాసంగా ప్రకటించి ఆ నెలలో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో మాతా శిశు ఆరోగ్యం, పౌష్టికాహారం లోపం, రక్తహీనత అంశాలపై ప్రజలలో నూటిని నూరు శాతం అవగాహన కల్పించినందుకు ఈ అవార్డు రావడం జరిగింది. ఈ కార్యక్రమం అమలు దేశంలో విజయనగరం జిల్లా మొదటి స్థానంలో నిల్చి జాతీయ స్థాయి ప్రథమ పురస్కారాన్ని పొందింది. పోషన్ భియాన్ కార్యక్రమంలో కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ, పట్టణ, గ్రామీణాభివృద్ధిశాఖ, గ్రామీణనీటి సరఫరా శాఖ, పంచాయతీరాజ్ శాఖ, వినియోగదారుల శాఖ, ఆహార ప్రజా పంపిణీ శాఖ, ఆయుర్వేద శాఖలను సమన్వయం చేస్తూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. పోషన్ అభియాన్ కార్యక్రమంలో సెప్టెంబర్ మొదటివారంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణీ స్త్రీలకు బరువు తీయడం, పిల్లలకు ఎదుగుదల పర్యవేక్షణ పత్రాలుపంపిణీ చేయడం, 2వ వారంలో పూర్వప్రాథమిక విద్యా దినం నిర్వహించుట, పూర్తయిన అంగన్వాడీ భవనాలను ప్రారంభించడం, తక్కువ సంఖ్యలో వున్న అంగన్వాడీ కయేంద్రాలను కలుపుటకు ప్రణాళికలు తయారు చేయడం, పోషణ, ఆరోగ్య విద్యపై పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం,3వవారంపరిశుభ్రం, పచ్చదనంపై అంగన్వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా వుంచడం, మహిళలు, పిల్లల చేతులు శుభ్రతపై అభ్యాసం చేయించుడం, పోషణ ఆహార తోటలు,వంటింటి తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, 4వ వారంలో అనుబంధ పోషకాహారం బాలామృతం, బాలసంజీవిని మొదలగు వాటితో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శించడం, మహిళలకు తీణధాన్యములు వంటల పోటీలు నిర్వహించడం, పాఠశాలలు, కళాశాలల్లో తృణధాన్యఆలతో తయారు కాబడుతున్న పదర్థాలపై ప్రసంగాలు ఏర్పాటు చేయడం, ఆహార ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేయడం వలన ఈ అవార్డు వచ్చింది. జాతీయ స్థాయి అవార్డుతో పాటు పోషన్ అభియాన్ అమలులో కన్వర్జెన్స్ కేటగిరిలో విజయనగరం జిల్లా భోగాపురం మండలం కొంగవానిపాలెం గ్రామం వార్డు మెంబరు శేషగిరిరావు, ఎస్‌హెచ్‌జి బంగారమ్మ, అంగన్‌వాడీ వర్కర్ పి.అనిత, ఎఎన్ఎం పి.లలిత, ఆశ వర్కర్ కె.రాములమ్మలకు, ఇండివిడ్యువల్ ఎక్స్‌లెన్స్ కేటగిరిలో భోగాపురం మండలం అల్లాడపాలెం గ్రామ అంగన్వాడీ వర్కర్ సుంకర శ్రీలక్ష్మిలు అవార్డులు అందుకున్నారు.

మొదటి పేజీ తరువాయి

# అతి తీవ్ర తుపానుగా బలహీనపడిన 'తిత్లీ'

కోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. తుపాను ప్రభావంతో తీరం వెంబడి 100 నుంచి 130 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీయొచ్చని, గాలుల తీవ్రత 145 కి.మీ వరకు పెరిగే అవకాశముందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులు సూచించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సికింద్రాబాద్-హవ్‌డా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట, బల్లార్షా, నాగ్‌పూర్, బిలాస్‌పూర్ మీదుగా దారి మళ్లించారు.

# అధికారం ఉంది కదాని.. విర్రవీగొద్దు

జిల్లాను కరవు నుంచి దూరం చేసేందుకు ప్రత్యేకంగా చొరవ చూపుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే లక్ష నీటి కుంటలు పూర్తి చేయడం, 5లక్షల ఎకరాలకు బిందు, తుంపర సేద్య పరికరాలు అందించామని చెప్పారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్నిఅభివృద్ధి పథంలోకి తీసుకురావాలని తాము ఎంతో కృషి చేస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం పునర్విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని నిలదీసే తాము ఎన్డీయే నుంచి వైదొలిగామని... అప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో వెనుకబడిన 7 జిల్లాల్లో అభివృద్ధి నిమిత్తం విడుదల చేసిన నిధులను సైతం కేంద్రం వెనక్కి తీసుకుందని.. ఇది న్యాయమేనా? అని ప్రశ్నించారు.

ప్రతిపక్ష పార్టీ నేతలకు కేసుల నుంచి బయటపడటంపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై లేదని చంద్రబాబు విమర్శించారు. ఎవరు అధికారంలో ఉంటే వారి కాళ్లు పట్టుకోవడం వారికి అలవాటేన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీని, కేంద్రాన్ని విమర్శించడం మానేసి.. రాష్ట్ర ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మోదీ పేరెత్తితేనే వైకాపా నేతలకు వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ఉప ఎన్నికలు రాకుండా అన్నీ ఆలోచించిన తర్వాతే వైకాపా ఎంపీలు రాజీనామా చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రెండు మూడు పార్టీలకు అభివృద్ధిని అడ్డుకోవడమే అలవాటుగా మారిందన్నారు. గత ఎన్నికల్లో తమకు మద్దతుగా ప్రచారం చేసిన పవన్‌కల్యాణ్ ఇప్పుడు మోదీ ఎలా చెబితే అలా నడుచుకుంటున్నారని ఆరోపించారు. జనసేన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వేసిన పవన్.. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.75వేల కోట్లు రావాలని తేల్చారని.. కానీ అప్పుడు ఆ నివేదిక ఊసే ఎత్తడం లేదన్నారు. రాజకీయాల్లో విలువలు, పద్ధతి ఉండాలని.. అధికారం ఉంది కదాని తప్పుడు పనులు చేయడం సరికాదన్నారు.

తాము భాజపాతో విభేదించక ముందు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు నెరవేర్చాలని తెరాస నేతలు కూడా డిమాండ్ చేశారని చంద్రబాబు గుర్తుచేశారు. ఎప్పుడైతే తెదేపా ఎన్డీయే నుంచి బయటకు వచ్చిందో అక్కడి నుంచి భాజపా నేతలు రెండు రాష్ట్రాల మధ్య విబేధాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మోదీ కంటే సీనియర్ రాజకీయ నేతని అయిన తనను పట్టుకుని మెచ్యూరిటీ లేదని ఆయన పార్లమెంటులో మాట్లాడటం ఏంటని? ప్రశ్నించారు. ఓ దశలో భాజపా దేశవ్యాప్తంగా రెండు సీట్లకే పరిమితమైన సమయంలో.. ఎన్టీఆర్ హయాంలోని తెదేపా 35 సీట్లతో కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచిందని.. తమ పార్టీ సత్తా అలాంటిదని గుర్తుచేశారు. ప్రపంచంలో తెలుగుజాతి ఎక్కడున్నా తెదేపా ఆదుకుంటుందన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా మహాకూటమిలో చేరితే అందుకు తనను వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

# కిడారి మృతి పార్టీకి తీరని లోటు

మృతి పార్టీకి తీరని లోటని మంత్రి లోకేష్ అన్నారు. గిరిజనులకు ఆయన చేసిన సేవల్ని మంత్రి కొనియాడారు. ప్రతి నిమిషం ఆయన గిరిజన ప్రాంతాల అభివృద్ధి గురించి ఆలోచించేవారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే సోమ కుటుంబాన్ని కూడా మంత్రి పరామర్శిస్తారు. లోకేష్ వెంట మంత్రులు చినరాజప్ప, నక్కా ఆనందబాబు.. ఎమ్మెల్యేలు అనిత, గడ్డి ఈశ్వరిలు ఉన్నారు.

# సుప్రీంలో 'రఫేల్'

ఆ వివరాలను వెల్లడించాలని చెప్పింది. మేము కేంద్రానికి నోటీసులు జారీ చేయడం లేదు. పిటిషనర్ల వాదనలు పరిగణలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేస్తున్నాం. వారి వాదనలు ఆమోదయోగ్యంగా లేవు అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. అయితే రఫేల్ ఒప్పంద నిర్ణయం ఏ విధంగా తీసుకున్నారో తెలపాలని ధర్మాసనం ఆదేశించింది. దేశ రక్షణ అంశమైనందున వ్యయాల విషయాన్ని అడగబోమని కోర్టు స్పష్టం చేసింది.

భారత్-ఫ్రాన్స్‌ల మధ్య జరిగిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. రూ.59వేల కోట్లతో 36యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రాన్స్‌కు చెందిన డసో కంపెనీతో చేసుకున్న ఒప్పందంలో అవకతవకలు జరిగాయని పిటిషనర్ ఎంఎల్ శర్మ వాదించారు. ఈ కేసు జాతీయ భద్రతకు సంబంధించిందని, దీన్ని రాజకీయం చేస్తున్నారని అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ కోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసులో దాఖలైన రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై అక్టోబరు 31న విచారణ జరపనున్నట్లు కోర్టు తెలిపింది.

# తెలంగాణలో మతపరమైన రిజర్వేషన్లను అడ్డుకుంటాం

అన్నారు. కేంద్రంలో బీజేపీని అడ్డుకునేందు రాహుల్ బాబా అండ్ కంపెనీ ప్రయత్నాలు చేస్తుందని ఆయన అన్నారు. కేసీఆర్ వాస్తవాలు మాట్లాడాలన్నారు. తెలంగాణపై మోదీ వివక్ష చూపుతున్నారంటూ అబద్దాలు మాట్లాడుతున్నారని, నాలుగున్నర ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన లక్ష పదిహేను వేల కోట్లు సంగతి మరిచారా? అని అమిత్ షా ప్రశ్నించారు. ఒక్క రోడ్లకే రూ. 40 వేలకు పైగా కేంద్రం నిధులిచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాగా అమిత్ షా సమక్షంలో దిలీప్ చారి(నాగర్ కర్నూల్), కుంచె రంగా కిరణ్ తదితరులు బీజేపీలో చేరారు.

# ఆ ఐదు స్థానాలకు ఉప ఎన్నిక ఎందుకు రాలేదు?

రాలేదంటే.. బీజేపీ-వైసీపీల మధ్య కుమ్మక్కు బైటపడిందని అర్థమవుతోందన్నారు. ఎంపీలు రాజీనామా చేసిన చోట ఉప ఎన్నికలు రాకుండా.. వాటి రాజీనామాల ఆమోదంలో ఆలస్యం చేసింది ఎవరని ప్రశ్నించారు. స్పీకర్ పై ఒత్తిడి తెచ్చి 52రోజులు పాటూ ఈ వ్యవహారాన్ని నాన్చింది ఎవరో చెప్పాలన్నారు. ఒకవేళ ఉప ఎన్నికలు జరిగితే టీడీపీ గెలుస్తుందనే భయంతోనే కుట్ర పన్నారని విమర్శించారు. ఉప ఎన్నికలు రాకుండా బీజేపీతో కలిసి కుట్ర పన్నారని విమర్శించారు యనమల. మోదీ, అమిత్ షా, జగన్ కుట్ర వల్లే బై పోల్స్ రాలేదన్నారు. కేంద్రం రాష్ట్రంపై రాజకీయంగా.. ఆర్థికంగా కుట్రలు చేస్తోందని మండిపడ్డారు మంత్రి. తెలంగాణలోని 9 జిల్లాలకు రూ.450 కోట్లు విడుదల చేసి.. ఏపీలోని 7 జిల్లాలకు అన్యాయం చేయడాన్ని ఏమనాలన్నారు. రెండు రాష్ట్రాలలో వెనుకబడిన జిల్లాలకు సాయం చేయాలని ఒకే చట్టం చెప్పిందని.. మరి ఏపీకి ఇచ్చిన నిధుల్ని వెనక్కి తీసుకోవడం దారుణమన్నారు.



**శ్రీ మహాకామేశ్వరి పీఠంలో యద్దనపూడి అయ్యనపంతులు దంపతుల ఆద్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమైన శ్రీదేవి శరన్నవరాత్రులు ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి దంపతులు, మావూరి వెంకటరమణ జ్యోతిప్రజ్వలనచేసి అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్, పీఠం ఉత్తరపీఠాధిపతి మహామహాశక్తి దేవి కార్యదర్శి వై. విజయ అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.**

# జగన్ రాకతో మౌలిక సమస్యల దూరం



విశాఖ సిటీః వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే స్థానిక సమస్యలు దూరమౌతాయని విశాఖ తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గడప గడపకూ నవరత్నాలు కార్యక్రమం విస్తృతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గడప గడపకూ వెళ్లి నవరత్నాలు పథకాలతో ముద్రించిన కరపత్రాలను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినట్లైతే అన్ని రంగాలలోను అణగారిన ప్రజానీకానికి అండగా నిలిచి నవరత్నాలు పథకాలను ప్రజలందరికీ అందేలా చేస్తారన్నారు. స్థానిక సమస్యలు తీరుస్తూ కొండపై ఉన్న ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తారని వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. నీటి సదుపాయం, రోడ్లు, విద్య, వైద్యం తదితర సదుపాయాలు లేక కొండవాలు ప్రాంతాలు అల్లాడుతున్న దృశ్యం తనకు కంటనీరు తెప్పించదని బాధపడ్డారు. రాష్ట్రానికి అమలుకానున్న సంక్షేమ పథకాలు జగన్ అధికారంలోకి రావడంతోనే తీరుతాయని ఖచ్చితంగా చెప్పారు. రావాలి జగన్.. కావాలి జగన్ అంటూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో పతివాడ కనకరాజు, దూళి రఘు, వినోద్, బసవయ్య, పిట్టా రెడ్డి, నాగేశ్వరరావు, కెల్ల సత్యనారాయణ, శ్రీను, ప్రసాద్, నాగేశ్వరరావు మరియు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పీతల కామేష్, నల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## జ్వరం సోకిన గృహ ప్రాంతంలో 200 గృహాలలో సర్వయిలెన్స్ నిర్వహించండి

- రెండవ జోన్ 9వ వార్డు హెచ్.బి కాలనీ, యం.యస్.ఎఫ్-4
- నాలుగవ జోన్ 38వ వార్డు పట్టాభిరెడ్డి కాలనీల సందర్శన
- అన్ని గృహాలలో స్ప్రేయింగ్ చేయించుకోవాలి
- చెత్త సేకరణ, కాలువల పూడికతీత పై శ్రద్ధవహించాలి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: జ్వరం సోకిన గృహం ప్రాంతంలో 200 గృహాలలో ప్యాసివ్, ఏక్టివ్ సర్వయిలెన్స్ నిర్వహించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. రెండవజోన్ 9వ వార్డు హెచ్.బి.కాలనీ, యం.యస్.ఎఫ్-4 నాలుగవజోన్ 38వ వార్డు పట్టాభిరెడ్డి కాలనీలను బుధవారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. సీజనల్ ఫీవర్ గుర్తించిన గృహం చుట్టు ప్రక్కల 200 గృహాలలో స్ప్రేయింగ్, ఫాగింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలు మలేరియా సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని గృహాలలో స్ప్రేయింగ్ చేస్తున్నది లేనిది అడిగి తెలుసుకొన్నారు. అదేవిధంగా ఎవరైనా స్ప్రేయింగ్‌కు సహకరిస్తున్నది లేనిది అడిగి, సహకరిస్తున్నట్లు తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నాలుగవజోన్ తాటిచెట్లపాలెం యం.యస్.ఎఫ్ నుండి వాహనాలు వెళుతున్నది లేనిది పరిశీలించారు. తదుపరి 38వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో జ్వరం సోకిన కుటుంబాన్ని పరామర్శించారు.

పర్యటనలో అదనపు కమిషనర్ (ఫైనాన్స్) విజయ్‌మనోహర్, రెండవ జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి, సి.యం.ఓ.హెచ్ డా.హేమంత్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.వి.రమణ, మలేరియా అధికారి రామచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముగురమ్మల మూలపుటమ్మ



విశాఖ సిటీః ముగురమ్మల మూలపుటమ్మగా భక్తులు అనునిత్యం కొలుస్తుండే దుర్గాలమ్మ తల్లిని శరన్నవరాత్రి శుభ సందర్భంగా 10 రోజుల పాటు వివిధ అలంకృతులలో అమ్మవారిని అర్చించి తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. తల్లికి ఇష్టమైన పళ్లు, పాలు, పూలు సమర్పించుకుంటారు. అటువంటి తల్లిని మనస్ఫూర్తిగా ఆరాధిస్తూ తన్మయత్వంతో తల్లి రూపాన్ని తలచుకుంటూ తమ కోర్కెలు తీర్చమని 10 రోజుల పాటు పండుగగా చేసుకుంటూ అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి ఆరాధిస్తూంటారు. ఆ తల్లి అందరినీ ఆదరించుగాక! విశాఖపట్నం నగరంలోని వెలంపేటనందు వేంచేసి యున్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవినవ రాత్రి మహోత్సవములు ఘనంగా ప్రారంభించారు. ఈ రోజు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మొదటి రోజున ఎం. మూర్తి 500 మందికి అన్నసమారాధన గావించారు.

## పదవుల కంటే ప్రజా సంక్షేమానికి మండల్ ప్రాధన్యమిచ్చారు



ఆంధ్రా యూనివర్శిటీః పదవుల కంటే ప్రజా సంక్షేమానికే మండల్ కమీషన్ చైర్మన్ బి.పి మండల్ ప్రాధాన్యమిచ్చారని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఉదయం ఏయూ ఆర్ట్సుకళాశాలలో బి.పి మండల్ శత జయంతి సంవత్సరంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్న వర్గాల అభ్యున్నతికి అవిశ్రాంత పోరాటం చేసారన్నారు. ఆయన కృషిఫలితంగా ఓబిసిలకు రిజర్వేషన్‌ను కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. మాజీ ప్రధాన పి.వి నరసింహారావు హయాంలో రిజర్వేషన్‌లు సాకారం అయ్యాయన్నారు. బి.పి మండల్ చేసిన త్యాగాలు నిరుపమానమన్నారు. పదవులను త్యజించి ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ ఆయన పనిచేసారన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రేమానందం, జి. రవికుమార్, లక్ష్మణ రావు, పితాని ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా బి.పి మండల్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

## జర్నలిస్టులు సమాజ సేవకులు

### వి.జె.ఎఫ్.లో బి.ఎస్.ఎన్.ఎల్. మేళా సభ్యులుకు 4జి సిమ్‌కార్డుల పంపిణీ



విశాఖపట్నం : సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అభినందనీయమని సెంచురియన్ యూనివర్శిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్. రాజు కొనియాడారు. బుధవారం డాబాగార్డెన్స్ వి.జె.ఎఫ్. ప్రెస్‌క్లబ్ బి.ఎస్.ఎన్.ఎల్. సౌజన్యంతో సభ్యులకు 4జి సిమ్‌కార్డులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ సేవకులని వారితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమని వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వి.జె.ఎఫ్. ఇతర ప్రాంతాలకు ఆదర్శనీయమన్నారు.

వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పి.వి. రమణమూర్తి మాట్లాడుతూ విద్య, వైద్యంతో పాటు ఇతర మౌళిక సదుపాయాలను జర్నలిస్టులకు కల్పించాల్సిన అవశ్యకత ఎంతైనా వుందన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వి.జె.ఎఫ్. అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా తమ పాలకవర్గం పనిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కవరేజ్ కోసం వెళ్ళే జర్నలిస్టులకు 4 జి సిమ్ కార్డులను ఉచితంగా సభ్యులకు అందజేశామన్నారు.

వి.జె.ఎఫ్. కార్యదర్శి ఎస్. దుర్గారావు మాట్లాడుతూ అందరి సహకారంతో అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో వి.జె.ఎఫ్. ఉపాధ్యక్షులు ఆర్. నాగరాజు పట్నాయక్, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్ కార్యవర్గసభ్యులు ఎం.ఎస్.ఆర్. ప్రసాద్, ఇరోతి ఈశ్వరరావు, డి. గిరిబాబు, మాధవరావు, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ సైకాలజీపై నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

## వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఆంధ్రవిశ్వవిద్యాలయంః ఏయూ సైకాలజీ విభాగం నిర్వహణలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు స్కూల్ సైకాలజీపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తెలిపారు. బుధవారం ఉదయం ఏయూ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సదస్సు వివరాలను వెల్లడించారు. ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసియేషన్, ఏయూ సైకాలజీ విభాగం సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయన్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు ఉపయుక్తంగా అధ్యాపకులు, కౌన్సెలర్లకు వివిధ అంశాలపై అవగాహన కల్పించడం సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. సదస్సులో భాగంగా ఇంక్యూసివ్ ఎడ్యుకేషన్ ఫర్ గిఫ్టెడ్ అండ్ స్పెషల్ చిల్డ్రన్, ఎక్స్‌క్లూజివ్ స్ట్రాటజీస్ ఫర్ డిజేబుల్డ్, అడ్వాన్సెస్ ఇన్ సైకోమెట్రిక్స్ ఫర్‌స్కూల్స్, పార్టిసిపేటరీ ఎడ్యుకేషనల్ ప్రాక్టీసెస్, రిలేషన్‌షిప్ కౌన్సెలింగ్ ఇన్ ఇండియా ఇట్స్ స్కోప్ అండ్ నీడ్, నీడ్ ఫర్ ఇన్నోవేటివ్ థెరపీస్ ఇన్ ఎడ్యుకేషనల్ సిస్టమ్, యోగా అండ్ మెటిటేషన్ తదితర అంశాలపై విభిన్న దేశాలకు చెందిన నిపుణులు చర్చలు, ప్రసంగాలు అందిస్తారన్నారు.

సదస్సులో భాగంగా ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసియేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు, లీడర్‌షిప్ అవార్డు, స్కూల్ సైకాలజీ సర్వీసెస్ అవార్డు, పి.కె సుబ్బరాజ ట్రస్ట్ బెస్ట్ పెరఫార్మెన్స్ అవార్డు, బెస్ట్ పేపర్ అవార్డు, లీడర్‌షిప్ అవార్డ్ ఫర్ స్కూల్ టీచర్, స్కూల్ సైకాలజీ పిహెచ్‌డి స్కాలర్ యంగ్ సైంటిస్ట్ అవార్డు, బెస్ట్ పేపర్ అవార్డు, స్కూల్ సైకాలజీ ట్రైనర్ అవార్డులను అందిస్తామన్నారు. సదస్సులో మలేషియా, ఇథియోపియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, స్విర్జర్లాండ్ తదితర దేశాలకు చెందిన సైకాలజీ నిపుణులు హాజరవుతున్నారన్నారు. మూడు రోజుల సదస్సుకు ఏయూ ఆతిధ్యం ఇవ్వనుందన్నారు.

11 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, 22 అతిధి ప్రసంగాలు ఉంటాయన్నారు. రెండో రోజు చిల్డ్రన్స్ అసెంబ్లీని నిర్వహిస్తామని, దీనిలో 400 మంది విద్యార్థులు హాజరువుతారన్నారు. సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. 170 పరిశోధన పత్రాలు మర్పణ, 9 అవార్డులు ప్రధానం జరుగుతుందన్నారు. పాఠశాల విద్యా విధానం ఎలా ఉండాలనే అంశంపై నిపుణులు తగిన సూచనలు చేస్తారన్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాస రావు సదస్సును ప్రారంభిస్తారన్నారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, ప్రిన్సిపాల్ ఆచార్య టి.వినోదరావు, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత సేవ అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే వాసుపల్లి అభినందన

- ప్రజా సేవలోనే నిజమైన సంతృప్తి
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



విశాఖ సిటీః ప్రజా సేవలోనే నిజమై సంతృప్తి ఉందని, ఈ విషయాన్ని బాలాజీ మరోమారు నిరూపించారని, అటువంటి బాలాజీని మనం సత్కరించుకోవడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా స్వచ్ఛత సేవ అవార్డు అందుకన్న మున్నం బాలాజీని బుధవారం ఎమ్మెల్యే వాసుపల్లి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సేవలోనే నిజమైన సంతృప్తి ఉందనే విషయాన్ని బాలాజీ మరోసారి నిరూపించారని అన్నారు. సంకల్ప శ్రీ దుర్గాలమ్మ 26వ వార్డు సొసైటీ అధ్యక్షుడు మున్నం బాలాజీ ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతకు మరింత వన్నె తెచ్చే విధంగా ప్రజా సేవలో పని చేస్తానని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో జోన్-3 శానిటేష్ సూపర్‌వైజర్ డేవిడ్, 26వ వార్డు అధ్యక్షుడు బుచ్చా రామిరెడ్డి, కొల్లి సింహాచలం, తిత్తి సాయిబలరాం, బెహరా శ్రావణి, గుంపిన అప్పలరాజు, రహీంతుల్లా, గరికిన ప్రతాప్, గనగళ్ల రామరాజు, మైలపల్లి శ్రీను, జఫ్రుల్లా, గణ తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ జీవీఎంసీ ఆధ్వర్యంలో రాస్తారోకో




సింహాచలం : 72 వార్డు పరిధి సింహాచలం గోశాల జుంక్షన్లో సీఐటీయూ జీవీఎంసీ సిబ్బంది రాస్తారోకో నిర్వహించారు రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ జేఏసీ పిలుపుమేరకు 13 జిల్లాల్లో రాస్తారోకో నిర్వహించారు వాహనాలు దిగ్భంధనం చేయటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 279 జీవో ను వెంటనే రద్దు చెయ్యాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కనీసవేతనం 18 వేలు చెయ్యాలని సేఫ్టీ పరికరాలు సిబ్బందికి అందజేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు ఈ రాస్తారోకోలో ముద్దాడ వర్రపసాద్ ,పి ఆనంద్ ,కె హరి, ఎస్ చిన్నారావు ఎస్ శ్రీను, ఏ బంగారుబాబు ,కె సంతోషి, సి హెచ్ దేముడమ్మ ,ఆర్ లక్ష్మి ,పి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్డీఐలో జీవన నైపుణ్యాలపై సదస్సు



ఆరిలోవః హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ వారు నిర్వహిస్తున్న ఆరిలోవలోని స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్‌లో జీవన నైపుణ్యాల స్థిరీకరణపై బుధవారం నాడు సదస్సు నిర్వహించారు. నెలకొల్పిన గత రెండేళ్ళలో నాలుగు వేలకు మించిన యువతకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పనలో ఎదురైన వివిధ అనుభవాలను క్రోడీకరించి అభ్యర్థులకు మరింత అనువైన శిక్షణ అందించి వారి దీర్ఘకాల భవితకు పునాదులు వేసే లక్ష్యంతో వివిధ నైపుణ్య శిక్షకులతో ఈ సదస్సు ఏర్పరచినట్లు సంస్థ ప్రిన్సిపాల్ సీ.వీ.నరసింహ దాసు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న చెన్నైకి చెందిన 310ఐ సంస్థ అధికారి డాక్టర్ ఉపాసన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలా ఉద్యోగికి వృత్తి నైపుణ్యంతో పాటు సక్రమ ప్రవర్తన, భావ వ్యక్తీకరణ చాలా అవసరమని, యువతలో లోపిస్తున్న ఈ అలవాట్లను సరిదిద్దడంలో సాఫ్ట్ స్కిల్ బోధకుల పాత్ర చాలా వుందని అభిప్రాయపడ్డారు. 18-25 ఏళ్ళ మధ్య వయష్కులైన యువతను అర్థం చేసుకోవడం క్లిష్టమైన విషయమైనా, తగిన ఓర్పు, నేర్పులతో వారిని దీర్ఘకాల లక్ష్యాలవైపు మళ్ళించాల్సి వుంటుందని డాక్టర్ ఆనంద్ తెలియజేశారు. ముప్పైకి మించి కోర్సులను నిర్వహిస్తున్న ఎస్డీఐకి ప్రతిరోజూ ఒక సవాల్ వంటిదని, దానిని దిగ్విజయంగా అధిగమించడానికే నిపుణులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు సీనియర్ మేనేజరు మహేష్ పేర్కొన్నారు.

## ప్రజలలో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవలసిన అవసరం ఎంతైనా వుంది

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్




విశాఖపట్నం: ప్రజలలో మాన సిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవలసిన అవసరం ఎంతైనా వుందని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో జరిగిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10 నుండి 24 సంవత్సరాల మధ్య వయస్సుగల యువత ప్రపంచవ్యాప్తంగా మానసిక రుగ్మతలకు లోనౌతూ అనారోగ్య సమస్యల బారిన పడి తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ సంవత్సరం యువతను దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఒ) యంగ్ పీపుల్ అండ్ మెంటల్ హెల్త్ ఇన్ ఎ ఛేంజింగ్ వరల్డ్ థీమ్‌లను ఈ సంవత్సరం తీసుకోవడం జరిగిందన్నారు. యువతలో ముఖ్యంగా కుటుంబ సమస్యలు, నిరుద్యోగ సమస్య, డ్రగ్స్, అల్కాహాల్, తదితర వ్యసనాల అలవాట్లు మానసిక సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. దీనివల్ల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నాయన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు నాణ్యమైన విద్యనందించడం, నైపుణ్యాభివృద్ధిలో శిక్షణను అందించి ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా వారిలో గల ఆత్మనూన్యతా భావాన్ని తొలగించడానికి కృషి చేస్తున్నారన్నారు.

ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాధారాణి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మానసిక సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఇంటర్నెట్ టెక్నాలజీ, మత్తు పదార్థాలను అతిగా వినియోగించి కొంతమంది మానసిక సమస్యల బారిన పడుతూ ప్రాణాలను కోల్పోతున్నారని, వ్యాయామం, ధ్యానం వంటివి అలవాటు చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడి నుండి బయట పడవచ్చునన్నారు. వారోత్సవాల్లో భాగంగా రోజుకొక అంశంపై కళాశాలలో కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డా.అర్జున, డా.పి.వి.సుధాకర్, డా.హిమకర్, డా.సత్పతి, వైద్యాధికారులు, నర్సింగ్ వైద్య కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

## సింహగిరి పై బాలాత్రిపురసుందరి దేవి ఆలయంలో ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు



సింహాచలం: సింహగిరిపై సింహాద్రి నాధుని క్షేత్రపాలకుడైన త్రిపురాంతకశివాలయంలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరి దేవి ఆలయంలో దసరా శరన్నవ రాత్రులలో భాగంగా మొదటి రోజు ఉత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి.

అమ్మవారికి విశేష అలంకరణులు చేసి ప్రత్యేక పూజలు పండితులు జరిపారు నవరాత్రులు పురస్కరించుకొని అమ్మవారికి రోజుకో అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారని పండితులు తెలిపారు

# విజయభాను

## సంపాదకీయం

### ఎన్నికల రణరంగం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రధాన ఘట్టానికి రిహార్సల్ అన్నట్లుగా ఐదు రాష్ట్రాల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చే నెల నవంబర్ 12న మొదలై డిసెంబర్ 7వ తేదీ వరకు వివిధ దశల్లో జరుగుతాయి. నక్సల్ ప్రభావిత రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ మినహా మిగతా నాలుగు రాష్ట్రాల్లో ఒకే దఫా ఎన్నికలు జరుగుతాయి. డిసెంబర్ 7న తెలంగాణతో పాటు, రాజస్థాన్‌లో ఎన్నికలు జరుగుతాయని ఎలక్షన్ కమిషన్ తెలిపింది. డిసెంబర్ 11న ఎన్నికల ఫలితాలు వెలువడి కొత్త ప్రభుత్వాలు ఏర్పడుతాయి. మరో ఆరునెలల్లో సార్వత్రిక ఎన్నిక లు జరగబోతున్న తరుణంలో ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల సరళి తప్పకుండా జాతీయ రాజకీయాలపై తీవ్రంగా ఉంటుందనటంలో సందేహం లేదు. ఈ ఐదు రాష్ట్రాలను చూస్తే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నది. తెలంగాణలో టీఆర్‌ఎస్, మిజోరంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నాయి. పెద్ద రాష్ట్రాలుగా ఉత్తరాది రాజకీయాలను ప్రభావితం చేయగల స్థితి ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఎన్నికల ఫలితాలు వచ్చే సార్వత్రిక ఎన్నికలపై తప్పకుండా ప్రభావితం చేస్తాయి. అయితే ఇప్పటికే వెలువడుతున్న అధ్యయనాలు, పోల్ సర్వే లు బీజేపీకి కష్టకాలమేనని చెబుతున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటికే ఒకట్రెండు సార్లు అధికారం నిలుపుకున్న బీజేపీ వ్యతిరేకతను తీవ్రంగా ఎదుర్కొంటున్నది. రాజస్థాన్‌లో గత పదేండ్లలో ఏ పార్టీ రెండోసారి అధికారం చేజిక్కించుకున్న దాఖలాల్లేవు. కానీ బీజేపీ వ్యతిరేక పవనాలున్నాయన్నది మాత్రం అధ్యయనాలన్నీ సూత్రప్రాయంగా చెబుతుండటం గమనార్హం.

పోల్ సర్వేలు, సామాజిక అధ్యయనాల ప్రకారం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నదన్నది తప్పి తే, ఈ రాష్ట్రాలన్నింటా కాంగ్రెస్ కష్టాలను ఎదుర్కొంటున్నది. సమర్థమైన ఏకధృవ నాయకత్వం లేదు. విభిన్న రాజకీయ కుంపట్లతో, అంతర్గత కుమ్ములాటలతో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో సహా చాలా ప్రాంతాల్లో తన ఉనికినే ప్రశ్నార్థకం చేసుకున్నది. రాజస్థాన్‌లో తప్పకుండా గెలిచితీరుతుందన్న వాతావరణంలో కూడా ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును ప్రకటించే స్థితి కాంగ్రెస్‌కు లేదు. కాస్త అటుఇటు గా తెలంగాణతో సహా అంతటా కాంగ్రెస్‌కు ఇదే దుస్థితి. తెలంగాణలోనైతే గెలుస్తారని అంచనా ఉన్నవారందరూ తామే ముఖ్యమం త్రి అభ్యర్థులమని చెప్పుకుంటున్న స్థితి ఉన్న ది. ఇదిలా ఉంటే ఏబీపీ-సీ ఓటర్, సీ ఫోర్ విడివిడిగా చేసిన సర్వేలు అన్నీ ఒకేవిధంగా ఏమీ లేవు. ఏబీసీ-సీ ఓటర్ సర్వే కాంగ్రెస్ హవా వీస్తున్నదని చెబుతుంటే, సీ ఫోర్ మాత్ర కాంగ్రెస్‌కు అనుకూలత ఉన్నదని మాత్రమే చెబుతున్నది. మరోవైపు గమనించాల్సిన విషయమేమంటే.. ఈ రాష్ట్రాల్లో ఈ అధ్యయనాలు చెబుతున్న దానిప్రకారం కాంగ్రెస్, బీజేపీల మధ్య రెండు శాతం ఓట్ల తేడా మాత్రమే ఉన్నది. ఇది కూడా ఎన్నికల నాటికి పరిస్థితులు, పార్టీల ప్రచారసరళి తదితర అంశాలతో ఓట్ల శాతం అటుఇటుగా మారవచ్చని కూడా చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ఎన్డీయేతర పక్షాలన్నింటినీ కలుపుకొని పోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌దే. కానీ అలాంటి చొరవ తీసుకుంటున్న పరిస్థితేమీ లేకపోగా, యూపీలో చేతులు కలిపిన బీఎస్పీని కూడా దూరం చేసుకుంటున్న తీరు రాజకీయ అపరిపక్వతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఏడాదిన్నర కిత్రం కర్ణాటక ఎన్నికల సందర్భంగా బీజేపీయేత ర 12 ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి జాతీయంగా మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవాలని నిర్ణయించాయి. కానీ అది ఆదిలోనే ఆవిరైపోయింది. ఉత్తరాదిన గుణాత్మకమైన ఓటుబ్యాంకు శక్తిగా ఉన్న బీఎస్పీ అధినేత్రి మాయావతి కాంగ్రెస్‌తో కలిసేది లేదని ప్రకటించేదాకా వెళ్లటం కాంగ్రెస్ స్వయంకృపరాదమే. అఒక ప్రత్యేక పరిస్థితుల్లో ముందస్తు ఎన్నికలకు సిద్ధమైన తెలంగాణలో విభిన్న స్థితి ఉన్నది. మిగతా రాష్ట్రాలకన్నా ముందుగానే ఎన్నికలు జరుగుతాయనుకన్నప్పటికీ ఓటరు జాబితాపై ఏర్పడిన వివాదాల నేపథ్యంలో అన్ని రాష్ట్రాలతోపాటు ఎన్నికలు జరిగే పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమానికీ కాంగ్రెస్ అడ్డుతగులు తూ కేసులతో ఆటంకాలేర్పరుస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ పనితీరుపై ప్రజాక్షేత్రంలోనే తీర్పునకు సిద్ధమయ్యారు. ఈ అనివార్యతలోంచి ముందస్తుగా వచ్చిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తనదైన శైలిలో దూసుకుపోతున్నది. గత నెల ఆరున అభ్యర్థుల ఎంపికను ప్రకటించి ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్‌కు, ఇతర ప్రతిపక్షాలకు సవాల్ విసిరింది. అయితే రాష్ట్రసాధన ఉద్యమ సమయంలో పోయిన ప్రతిష్టను నిలుపుకోవటానికి ఒక నిర్మాణాత్మక ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరించలేకపోయింది. తెలంగాణ నినాదాన్నే అవహేళన చేసి, రాష్ట్ర ఏర్పాటును అడుగడుగునా అడ్డుకున్న టీడీపీతో మహాకూటమి పేరుతో జతకట్టడం ఆత్మహత్యాసదృశ్యమే.

## సమ్మె విరమించి పురపాలక సంఘానికి సహకరించండి

### పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ విజ్ఞప్తి



విజయనగరం : దసరా, పైడితల్లి అమ్మవారి జాతరను దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య కార్మికు లందరూ సమ్మెను విరమించి విధుల్లో చేరాలని పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం టి.వి.రమణ ఆధ్వర్యంలో పలువురు పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామ కృష్ణను ఆయన చాంబర్‌లో కలసి తమ సమస్య లను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ పండగ సందర్భంగా ఇతర జిల్లాల నుండి లక్షలాదిమంది పట్టణానికి వస్తారని, వారికి పారిశుద్ధ్య పరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. పట్టణ పౌరులుగా సమ్మెలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులందరూ తక్షణమే సమ్మెను విరమించి పురపాలక సంఘానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 279 జీవో వల్ల కార్మికులకు అనేక సౌకర్యాలు కలుగుతాయని వివరించారు. కార్మికుల ఉద్యోగ భద్రతకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేశారు. పండగ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులందరూ జీతాలు లేకుండా సమ్మెచేయడం వలన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సంఘం నాయకులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులందరూ సేవాదృక్పథంతో ఆలోచన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు టి.వి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు సమ్మెలో ఉన్నారని, విజయనగరంలో అమ్మవారి పండుగను దృష్టిలో పెట్టుకుని చైర్మన్ సూచనలను కార్మికులతో చర్చించి నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో కమిషనర్ టి.వేణుగోపాల్, హెల్త్ ఆఫీసర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహప్రతిష్ట



గాజువాక: జీవీయంసీ 63వ వార్డు పాతమున్సిపాల్ కార్యాలయం వద్ద శ్రీదుర్గానూకాంభిక ఉత్సవ కమిటీ ఆవాల శివ,శ్రీలత దంపతుల సారధ్యంలో శ్రీదేవిశరన్నవ రాత్రుల మహొత్సవం సంధర్భంగా శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహప్రతిష్ట కార్యక్రమాన్ని బుధ వారం వైభవంగా నిర్వహించారు. ఈ సంద ర్బంగా ఆలయ కమిటీ మాట్లాడుతూ ప్రతి ఏడాది దశరా సందర్బంగా అమ్మవారి ఉత్స వాలను వైభవంగా నిర్వహిం చడం జరుగు తుందని అన్నారు. ప్రతీ రోజూ అమ్మవారిని వివిద రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించడం జరుగు తుందని తెలిపారు.

ప్రతీ రోజూ నిర్వహించు ప్రత్యేకపూజలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులుకావాలని కోరారు. ఈ కర్యాక్రమంలో మాజీ కార్పోరేటర్ యం.డి.రఫీ, తెదేపా నాయకులు యేదూరి వెంకటరావు, సరోజిని, యం.కోటి, దేవి, యం.గణేశ్, ఎ.బాలా, కె.కళ్యాణ్ స్ట్రీట్ రాకర్స్ అండ్ ఫ్రెండ్స్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారం సేవలకు గుర్తించిన జనసేన పార్టీ



అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గ జనసేన నాయకులు కొణతాల సీతారాం తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణం ఆశయాల మేరకు అధికారం, హొదాతో పని లేకుండా, తన సొంత నిధులను వ్యచ్చించి, మరియు ప్రజలకు చేసిన సేవలను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పూర్తిస్థాయిలో గుర్తించారని చెప్పుకోక తప్పదు. జనసేన ఆవిర్భావం తర్వాత సీతారాం ఆపార్టీలో చేరడానికి కొంత ఆలస్యమైనా, తన దూకుడుతో అనతికాలంలోనే ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ పునాదులను బలపరిచారు. సీతారాం వేగాన్ని అందుకోలేకపోయిన కొందరు జనసేన కార్యకర్తలు ఒక గ్రూపుగా ఏర్పడి పార్టీని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించినా, సీతారాం ఎప్పటికప్పుడే అడ్డుకట్ట వేస్తూ పార్టీలో ఎలాంటి ఒడిదుడుకులు రాకుండా, జాగ్రత్త పడ్డారు. ఒకప్పుడు పది మంది చేతిలో పరిమితం అయిపోయిన, జనసేన జెండా ఈరోజున ప్రతీ గ్రామంలో ఎగురు తుందంటే దానికి కారణం సీతారాంతో పాటుగా, వందల సంఖ్యలో ఉన్న, అతని అనుచరులు కృషే కారణం ఈ తరహా సేవలను గుర్తించిన, అదిష్టానం సీతారాంకి జిల్లాకమిటీ సభ్యుడిగా బాధ్యతలను అప్పగించడం పట్ల, సర్వత్రహర్షం వ్యక్తమవుతుంది.

తాజా హొదాతో సీతారం భవిష్యత్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తారని పలువురు జనసేన నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## గంటా క్యాంపు కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



భీమునిపట్నం : స్థానిక గంటా క్యాంపు కార్యాలయం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని పారిశుద్ధ్య కార్మికులు ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో సిఐటియు డివిజన్ నాయ కులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ ప్రభు త్వం పారిశుద్ధ్య కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు .రానున్న రోజుల్లో గంటా క్యాంపు కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపడతామని అన్నారు 279 జీవో వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి రవ్వ నర్సింగరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని తెలిపారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను ఆపమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు,పారిశు ద్ధ్యకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సమకాలం

### 'నీ కోసం'

నువ్వు పరిచయమైన క్షణాన్ని
తలచుకుంటూ
నీ కోసం
లెక్కలేనన్ని
క్షణాలు
గడిపాను
నీ నవ్వు కోసం
పరవశించి పోయాను
నీ చూపు కోసం
ఆకలి సైతం
మర్చిపోయాను
నీ రాక కోసం
నిద్రను
దూరంగా పెట్టాను
మళ్ళీ కలుస్తావని
నమ్మకంతో
ఎదురుచూస్తున్నాను

...కవితా రచన
వైదా ఈశ్వరరావు
సెల్ నెం : 7674942843

## పంచాంగం

| మాసం : ఆశ్వయుజ; తిథి : విదియ ఉ.6.57; స్వాతి మ.12.26; సా.వ.6.08ల 7.45 | గురువారం 11-10-2018 |
|---|---|

**మేషం** ప్రేమికుల మధ్య నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఎప్పటి నుంచో వాయిదా పడుతున్న వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది.

**వృషభం** : ఆకస్మిక ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. నిరుద్యో గులకు కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. స్త్రీలకు వాహనం నడుపునపుడు మెళకువ అవసరం. ఆడిటర్లకు, అకౌంట్స్ రంగాల వారికి పనిభారం అధికంగా ఉంటుంది.

**మిథునం** : చిన్నతరహా పరిశ్రమలలో వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఖర్చులు పెరగటంతో రుణ యత్నాలు, చేబదుళ్ల స్వీకరిస్తారు.

**కర్కాటకం** : ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి అనుకున్నది సాధిస్తారు. అనుకోకుండా ఏర్పడిన ఒక స్నేహబంధం భవిష్యత్‌లో మీకు మంచే చేస్తుంది. సంతానం విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరుస్తారు. ఖర్చులు సామాన్యం.

**సింహం** : మొండి బాకాయిలి వసూలు కాగలవు. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగనైనా సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చు కుంటారు. కుటుంబ విషయాలు, ఆర్థిక లావాదేవీలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

**కన్య** : నిరుద్యోగుల ఆలోచనలు ఉపాధి పథకాల దిశగా సాగు తాయి. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైన సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. పత్రిక, ప్రైవేటు సంస్థలలో వారికి మార్పులు అనుకూలిస్తాయి.

**తుల** : దూర ప్రయాణాలలో మెళకువ అవసరం. తలపెట్టిన పనుల్లో ఒకింత జాప్యం, చికాకు తప్పదు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త అవసరం. ఆత్మీయుల నుంచి సహాయాన్ని పొందుతారు.

**వృశ్చికం** : విద్యార్థులు అతి కష్టం మీద పై చదువులకు అవకాశం లభిస్తుంది. మీ సంతానం భవిష్యత్ గురించి కొత్త కొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. చేతి వృత్తుల వారికి ఓర్పు, నేర్పు ఎంతో అవసరం. నూతన పరిచయాలు ఏర్పడతాయి.

**ధనుస్సు** : వాహనం నడుపునపుటలో మెళకువ అవసరం. రాజకీయ నాయకులకు పదవి సమస్యలు అధికమవుతాయి. మిత్రుల సహకారంచో ఓ సమస్యను సునాయాసంగా పరిష్కరిస్తారు. కంప్యూటర్ రంగాల వారికి పురోభివృద్ధి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, వాణిజ్య ఒప్పందాల్లో మెళకువ వహించిండి.

**మకరం** : సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాలు గూర్చి తగాదాలు రావచ్చు. దైవ కార్యాలలో పాల్గొంటారు. రావలసిన ధనం చేతికందకపోవడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరగలదు. నిరుద్యోగులకు ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది.

**కుంభం** : కీలకమైన వ్యవహారాలలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. స్త్రీలు అదనపు సంపాదన దిశగా ఆలోచన చేస్తారు.

**మీనం** : కొత్తగా చేపట్టిన వ్యాపారాల్లో క్రమేణా నిలదొక్కుకుంటారు. ప్రముఖులతో ముఖ్య వ్యవహారంపై సంప్రది ంపులు జరుపుతారు. రుణ యత్నాల్లో ఆటంకాలు తొలగిపోతాయి. రావలసిన ధనం చేతికందుతుంది. గృహంలో దైవ కార్యక్రమాలుచేయుట వంటి శుభ పరిణామాలు ఎదుర్కుంటారు. స్త్రీలకు పనిభారం అధికం.

# ఖనిజ సంపదను దోచుకుంటున్న గురజాల ఏంఎల్ఏ యరపతినేని



**- మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి- అమాయకులపై అక్రమ కేసులు తొలగించాలి**

**- మైనింగ్ పై పోరాటం చేసే వారికి బెదిరింపు ఫోన్లు**

**- విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిజిపి, సిఐడి అడిషినల్ డిజి ని కోరిన వైసిపి నేతలు**

గుంటూరు : జిల్లా పల్నాడు లో గత నాలుగేళ్లుగా జరుగుతున్న మైనింగ్ అక్రమాల నిగ్గు తేల్చాలని వైసిపి ఏంఎల్ సి , మాజి కేంద్ర మంత్రి డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు డిమాండ్ చేసారు. అక్రమ మైనింగ్ పై వైసిపి నిజ నిర్ధారణ కమిటి సబ్యులు అనేక మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లిన ఫలితం కనిపించడం లేదని ఆయన వాపోయారు. అక్రమ మైనింగ్

వ్యవహారంలో ముఖ్యమంత్రి నుంచి అందరూ భాగస్వాములేనని ఆయన చెప్పారు. అక్రమ మైనింగ్ పై ఏర్పాటైన వైసిపి నిజనిర్ధారణ కమిటి సభ్యులు డాక్టర్ ఉమ్మారెడ్డి నేతృత్వంలో నర్సరావుపేట శాసనసబ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నర్సరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ అద్యక్షుడు శ్రీ అంబటి రాంబాబు, మాజి ఏంఎల్ సి శ్రీ జివిజి కృష్ణారెడ్డి, సమన్వయకర్త శ్రీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, గురజాల నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కాసు మహేష్ రెడ్డి, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ ఇక్బాల్ లు రాష్ట్ర డిజిపి ఠాగూర్, సిఐడి అడిషినల్ డిజి అమిత్ ఖర్గ లను కల్సి వినతి పత్రం సమర్పించారు. అక్రమ మైనింగ్ వ్యవహారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి కింది స్దాయి వరకు పాత్ర ఉందని డాక్టర్ ఉమ్మారెడ్డి ఆరోపించారు. గత నాలుగేళ్ల నుంచి పల్నాడు ప్రాంతంలో

అరాచకంగా మైనింగ్ సాగుతుందన్నారు. దీనిపై హైకోర్టు సీరియస్ గా ప్రబుత్వానికి హెచ్చరించిందన్నారు. అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వానికి ఏంత నష్టం జరిగిందన్న విషయాన్ని వెల్లడించాలని ఆదేశాలు జారి చేసింది. ఈ విషయంలో ప్రభుత్వం పూర్తి స్దాయిలో నిర్లక్ష్యం గా ఉందని ఆయన మండి పడ్డారు. మైనింగ్ వ్యవహారం పై ఏవరైన పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారి పై కోంతమంది దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. వాటి పై విచారణ చేపట్టి న్యాయం చెయ్యాల్సిందిగా డిజిపి ని కోరిన్నట్లు ఆయన చెప్పారు.

ముఖ్యంగా మైనింగ్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాద్యత పోలీసు యంత్రాంగం పై ఉందని కూడ చెప్పడం జరిగిందని ఆయన వివరించారు. గురజాల నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ పై పోలీసు లు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరిన్నట్లు తెలిపారు.

అక్రమ మైనింగ్ విషయంలో హైకోర్టు ఏక్కడా సిబిఐ కు విచారణ చేపడుతుందన్న భయంతో రాష్ట్ర ప్రభుత్వమే సిఐడి విచారణకు ఆదేశించడం వెనుక మతలబు ఏమిటో అర్దమవుతుందన్నారు. విచ్చలవిడిగా జరుగుతున్న ఈ మైనింగ్ లో స్దానిక శాసనసబ్యుడు యరపతినేని శ్రీనివాసరావు నుంచి వడ్డి తో సహా జరిమాన చెల్లించాలని ఆయన కోరారు. మైనింగ్ పై పోరాడుతున్న వారికి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నట్లు వీటిపై కూడ విచారణ చేప్టాల్సిందిగా రాష్ట్ర డిజిపి , సిఐడి అడిషినల్ డిజి ని కోరిన్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి జెడ్ పి టి సి రామిరెడ్డి, వైసిపి బిసి సంఘ నేత కె గురవాచారి, ఏం వెంకటేశ్వరరెడ్డి, ఓబుల్ రెడ్డి, కోమ్మినేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# "రేషన్" అను బ్రాండ్ వస్తువులకు పౌర సరఫరాల శాఖకు సంబంధంలేదు

### - సంయుక్త కలెక్టర్ జి.సృజన




విశాఖపట్నం: "రేషన్" అను బ్రాండ్ పేరు మీద సరుకులు పంపిణీ చేయడానికి జిల్లాకు 300 మంది పంపిణీదారులు (డిస్ట్రిబ్యూటర్) కావాలని ప్రచారంచేస్తూ, ఒక్కొక్కరి దగ్గర నుంచి సుమారు రూ. 1 లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఈ సందర్భంగా ప్రజలకు తెలియచేయునదేమనగా "రేషన్" అను బ్రాండ్ పేరుగల వస్తువులు ఏవి పౌర సరఫరాల శాఖకు చెందినవికావు. పౌరసరఫరాల శాఖ చేస్తున్నవి కావు. దీనికి ప్రజా పంపిణీ వ్యవస్థకు కాని, మరి ఏ ఇతర ప్రభుత్వ సంస్థకు కాని సంబంధంలేదు.

"రేషన్" అను పేరు చూసి మోసపోవద్దని ప్రజలకు తెలియచేయుడమైనది. మరియు పంపిణీదారులు నియామకానికి ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని విశాఖ పట్నం సంయుక్త కలెక్టర్ జి.సృజన తెలిపారు.

# జాతికి పురోగతికి మేలు బాటలు వేయాల్సింది యువతే –డా.శ్రీపాద




అమలాపురం: జాతి పురోగతికి మేలు బాటలు పర్చాల్సిన యువత మనో కల్లోలంతో నిర్వీర్యం కాకుండా మంచి చెడుల అవగాహనే అసలు మందు అని ప్రముఖ విజ్ఞాన వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ శ్రీపాద రామకృష్ణ అన్నారు. స్థానిక మిరియా డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జరిగిన 'మారుతున్న ప్రపంచంలో యువత మానసిక ఆరోగ్యం' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు శ్రీపాద ముఖ్య అతిథిగా హాజరై డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో మారిన సామాజిక పరిస్థితుల్లో విద్యార్థులు గురవుతున్న ఒత్తిడిని అధిగమించ డానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తమకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం డా.శ్రీపాద మాట్లాడుతూ మానసి కంగా తమ శక్తి సామర్థ్యాలను గుర్తించగలిగి సాధారణ ఒత్తిడిని అధిగమించగలిగి నిర్మాణాత్మ కంగా పనిచేయగలగడాన్ని మానిసిక ఆరోగ్యంగా చెప్పవచ్చని, వ్యక్తి ప్రవర్తన, ఆలోచనల్లో ఏవైనా అసాధారణ మార్పులు కనిపిస్తే వెంటనే సమస్యగా దాన్ని గుర్తించి నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు. శారీరక ఆరోగ్య రక్షణ , వ్యాయామం చేయడంతోపాటు టివి, సెల్, ఇంటర్నెట్ వంటి వాటి నియంత్రణ, క్రీడలు, కుటుంబ అనుబంధాలకు విలువ ఇవ్వడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. సందేహాలకు విద్యార్థులు ముఖాముఖి ద్వారా నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి కన్యాకుమరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానం ఉద్యోగుల సంఘం ఆద్వర్యంలో ఈ సంవత్సరం శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 8 గం.లకు శ్రీ దుర్గమ్మవారు అన్నవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయం నుండి 108 మంది సువా సినులుచే 108 కలశములతో ఉత్సవ ప్రాంత మైన అన్నవరం దేవస్థానం బస్సు గ్యారేజీ వరకు అత్యంత వైభవంగా ఊరేగింపు జరిగింది. తదుపరి విఘ్నేశ్వరుని పూజ, పున్యహవాచనము, మండప ఆవాహన అమ్మవారి యొక్క కలశ విగ్రహ స్థాపన విశేష పూజ, నీరాజన మంత్ర పుష్పములతో అమ్మవారిని ప్రతిష్టించారు. అనంతరం అన్నవరం దేవస్థానం కార్యనిర్వ హణాధి కారి ఎమ్.జితేంద్రచే అమ్మవారి విజయ పతాక ఆవిష్కరణ చేసారు.అలాగే నవరాత్రి మహోత్సవాలు తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాలలో అమ్మవారు విశేష అలంకరణలతో భక్తులకు దర్శనము ఇస్తారు. అలాగే నవరాత్రు లలో చివరి రోజు అనగా 18 వ తేదీ సాయంత్రం 4 గం.లకు దేవస్థానం జూనియర్ కాలేజీ గ్రౌండ్ నందు ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి సారిగా 35 అడుగుల ఎత్తుగల బొమ్మను (మహిసాసు రవధ) బాణాసంచాతో దేవస్థానం ఈవో ఎమ్. జితేంద్రచే నిర్వహించబడును. దేవస్థానం చరిత్ర లోనే ఇంతటి మహకార్యము తలపెట్టడం మొదటిసారని గ్రామస్థులు, భక్తులు తెలిపారు. ఇంతటి చక్కటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన దేవస్థానం పిఆర్వో తలా.రాముడును పలువురు భక్తులు,గ్రామస్థులు ప్రశంసించారు. ఈ కార్యక్ర మంలో ఏసి ఈరంకి.జగన్నాధరావు, సూపరిం టెండెంట్లు బలువు.సత్య శ్రీనివాస్, దామెర. కృషా రావు మరియు పోల్నాటి. లక్ష్మినారాయణ,సీసీ గణపతి దేవస్థానం అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం శ్రీ సత్యదేవ జూనియర్ కళాశాలలో బుధవారం సరస్వతీ దేవి విగ్రహంను అత్యంత వైభవం గా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎమ్.జితేంద్ర గారు ప్రతిష్టిం చారు. ఈ విగ్రహన్ని కళాశాలలో చదువుచున్న ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం హెచ్ ఇసి విద్యార్థులు గుర్తుగా ఏర్పాటు చేసినట్లు కళాశాల క్లాస్ టీచర్ శ్రీమతి మాణిక్యాంబ తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీ డొంకాడ. గిరి,ఎన్ఎస్ఎస్ పివో గంటసాల.వెంకట్ మరియు అద్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన దసరావేడుకలు

పెద్దాపురం: దసరా ఉత్సవాలు బుధవారం నుండి ఘనంగా ప్రారంభమైనాయి. పెద్దాపురం మరియు గ్రామీణ ప్రాంతాలలో అమ్మవారి భారీ విగ్రహాలను నిలిపి, భారీ ఎత్తున పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. పెద్దాపురం పట్టణంలో గల మునిసిపల్ సెంటర్, దర్గాసెంటర్, మొదలగు అనేక రహదారి కూడళ్ళల్లో సందిళ్ళు వేసి భారీ విగ్రహాలు పెట్టారు. విద్యుత్ దీపాలంకరణ, పూలమాలలతో అలంకరణలు చేసారు. దూపదీప నైవేద్యాలతో కన్నుల పండుగగా ఉత్సవాలనను ఏర్పాటుచేశారు. పట్టణంలో టాక్సీ స్టాండు, ఆటో డ్రైవర్ల స్టాండ్ మొదలకు అనేక కార్మికశాఖలు అమ్మవారి ఉత్సవాలను ఏర్పాటుచేశారు. ఈ వేడుకలు 18 వ తేదీ విజయదశమితో ముగియనున్నాయి. ఈ 9 రోజులు దేవాలయాలలో ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారిని ఘనంగా పూజిస్తారు. అదేవిధంగా చండీయాగం ఘనంగా నిర్వహించి దసరావేడుకలను జరుపుతారు.

## శ్రీప్రకాష్‌లో సౌత్‌జోన్ బాలికల హ్యాండ్‌బాలు పోటీలు

పెద్దాపురం: ఈ నెల 11వ తేదీ నుండి 15వ వరకు పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో 7 రాష్ట్రాలకు చెందిన మరియు 4 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సిబిఎస్‌సి సౌత్ జోన్ బాలికల హ్యాండ్ బాలు పోటీలు నిర్వహిస్తున్నట్లు బుధవారం శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ సిఒఒ కె. శ్రీనివాసరావు విలేఖర్లకు తెలిపారు. ఈ పోటీలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని తెలిపారు. ముగింపు ఉత్సవాలకు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తోట నరశింహం హాజరౌతారని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ లైజన్ ఆఫీసర్ ఎం. సతీష్ ఈ పోటీల నిర్వహణబాధ్యతలు స్వీకరించి ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరపడానికి కృషి చేస్తున్నారు.

## దుర్గమ్మవారికి వెండి కిరీటము బహుకరణ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రైల్వే స్టేషన్ రోడ్డు నందు కొలువైయున్న శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ వారికి స్థానిక ప్రముఖ వెంకట సత్య సాయి ఎంటర్‌ప్రైజెస్ మరియు గౌతమి ఆక్వా ఇండస్ట్రీస్ వారి ఆద్వర్యంలో నాగం.కొండబాబు కుమారుడు నాగం.ప్రసాద్ శ్రీమతి లక్ష్మి దంపతులు అమ్మవారికి సుమారు 50,000/- విలువ గల వెండి కిరీటమును బహు కరించారు. ఈ కార్యక్రమంలో నాగం.విష్ణుకుమారి, రాజా, కైలాష్, అరిగెల.దొర, సునీత, సాయి,గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు ఎంపికైన శాంతిశ్రీ విద్యార్థి కైలాస్ వర్మ



అన్నవరం: తూ.గో.జిల్లా అన్న వరం సిఎం కప్ బాల్ బాడ్మిం టన్ పోటీలకు ఇటీవల కాకినాడ లో జరిగిన సెలక్షన్ పోటీలలో తొండంగి మండలంలోని గోపా లపట్నం గ్రామానికి చెందిన విద్యార్థి కొమ్మ.కైలాష్ వర్మ స్టేట్ సెలక్షన్ కు ఎంపికయ్యారు.వర్మ స్థానిక గోపాలపట్నం శాంతిశ్రీ విద్యానికేతన్‌లో 9వ తరగతి చదువు తున్నాడు. రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన కొమ్మ.కైలాష్ వర్మను పాఠశాల డైరెక్టర్ నరసింహమూర్తి. కరస్పాండెంట్ వైవి.సత్యనారాయణ, కొమ్మ.గణపతి, పిఇటీలు చిరంజీవి, గోపీకృష్ణ మరియు ఉపాద్యాయ బృందం అభినందించారు. అయితే ఈ నెల 13,14,15వ తేదీలలో నెల్లూరు జిల్లా గూడూరులో జరిగే సిఎం కప్ లో విజయకేతనం ఎగురవేయాలని తుని మార్కెట్ కమిటీ చైర్మెన్ యనమల.కృష్ణుడు, మండల అభివృద్ధి కమిటీ చైర్మెన్ యడ్ల.బేతాళుడు(రాజా)అభినందనలు తెలియజేసారు.

# యానాం జిప్‌మేర్‌కు రూ. 77 కోట్లు విడుదల చేయాలి

### కేంద్ర మంత్రులతో మంత్రి మల్లాడి బేటి



యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో ఏర్పాటుచేయనున్న జిప్‌మేర్ బ్రాంచ్‌కు సంబంధించి రూ. 77 కోట్ల మేర నిధులు విడుదల చేయాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు కోరారు. ఈ మేరకు మల్లాడి ఢిల్లీలోని పలువురు కేంద్ర మంత్రులను, ఉన్నతాధికారులతో బేటీ అయ్యారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాతో బేటీ అయ్యారు. తొలత ఆయనను కలిసి సత్కరించి అనంతరం యానాం జిప్‌మేర్‌లకు సంబందించిన పలు అంశాలపై చర్చించి రూ. 77 కోట్ల మేర అదనంగా నిధులు విడుదలచేయాలని కోరారు. ఈ ప్రతిపాదనను ఈ నెల 15వ తేదీన జరిగే స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ సమావేశంలో చర్చించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం కళలు, సాంస్కృతిక శాఖ మంత్రి మహేష్‌శర్మతో బేటీ అయ్యారు.

యానాంలో కల్చరల్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై వివరించారు. పదుచ్చేరి రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాలలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్రం విడుదలచేయాల్సిన నిధులను, అనుమతులను త్వరితగతిన ఇచ్చేలా చూడాలని ఈ సందర్భంగా కోరారు.

# కేంద్ర కార్యదర్శులతో మంత్రి మల్లాడి బేటి

యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి, యానాం ప్రాంతాలకు సంబంధించి పలు అంశాలపై కేంద్ర ఉన్నతశాఖ కార్యదర్శులతో పుదుచ్చేరి మత్స్యశాఖ, క్రీడా, జలవనరులశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు బేటీ అయ్యారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ఆయన పలువురు కేంద్ర మంత్రులతోను, కార్యదర్శు లతో బేటీ అయ్యారు. ఈ మేరకు మత్స్యశాఖ కార్యదర్శి తరుణ్‌శ్రీధర్‌తో బేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా యానాం హార్బర్ రెండవ దశ నిధులతోపాటు పుదుచ్చేరికి స్వచ్ఛతా మిషన్‌లో భాగంగా హార్బర్ నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా సేవింగ్ స్కీమ్‌లో 2015కు సంబంధించి బకాయిలను విడుదలచేయాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శ్రీధర్ సంబంధిత అధికారుకలు ఆదేశాలు జారీచేశారు. అనంతరం క్రీడాశాఖ కార్యదర్శి రాహుల్ భట్నాకర్‌తో బేటీ అయ్యారు. ఉప్పలం స్టేడియం అభివృద్ధికినిధులు విడుదలచేయాలని కోరారు. అనంతరం జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్‌లత బేటీ అయ్యి వరద పరివాహక ప్రాంతాలలో శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేయడంతోపాటు వాటికి కేటాయించాల్సిన నిధులు కూడా ఇవ్వాలని కోరారు. అనంతరం పలువురు అధికారులతో మంత్రులతో బేటీ అయ్యారు.

# ఘనంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్ర మహెూత్సవాలు

రావులపాలెం : ప్రపంచమంతా అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకునే పండుగ దసరా పండుగ. హిందువులు అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకునే పండుగల్లో ముఖ్యమైన పండుగ దసరా పండుగ అని, దసరా పండుగలో శక్తిని ఆరాదించడం అనాదిగా ఆనవాయితీగా వస్తుందని, అశ్వయుజ పాఢ్యమి మొదలుకొని శుద్దనవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటారని వేద పండితులు పెడసనగంటి సీతారామమూర్తి శర్మ అవధాని అన్నారు. అదే ఆనవాయితీగా మండలంలో బుధవారం అమ్మ వారి దసర నవరాత్ర మహెూత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒక్కో రోజు ఒక్కో అలం కారంలో అమ్మవార్ని పూజించి ఆఖరి రోజున పార్వేట ఉత్సవం నిర్వహించుకుంటారని ప్రతీతి. బుధవారం అమ్మవారి ఆలయంలో తెల్లవారు ఝామునుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్కి కుంకుమ పూజలు నిర్వహించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ మహెూత్సవాల్లో భాగంగా స్థానిక మార్కెట్ వద్ద మారుతి నగర్‌లో విజయకనకదుర్గ మందిరంవద్ద ఏర్పాటు చేసిన దుర్గా మందిరంలో ఇంద్రకీలాద్రి (విజయవాడ) లో వెలసిన అమ్మవారిలా అలంకరించిన మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు. విజయ కనక దుర్గ అమ్మవారి నమూనాలో విగ్రహం ఏర్పాడు చేయడంతో విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవార్ని దర్శించుకున్నంత మధురానుభూతిని భక్తులు పొందారు. మొదటి రోజు స్వర్ణకవ చాలంకృత దుర్గాదేవిగా దర్శనమిచ్చిన శిబిరంలో సుమారు 100 మంది భవానీ దీక్షాపరులు ప్రత్యే పూజలు నిర్వహించారు.

అలాగే మండలంలో గోపాలపురం, ఈతకోట, వెదిరేశ్వరం, ఊబలంక, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లిలో ఏర్పాటు చేసిన అమ్మవారి శిబిరాల్లో భక్తులు తెల్లవారుఝాము నుండే బారులు తీరి అమ్మవారి దర్శనం చేసుకొని ప్రసాదాలు స్వీకరించారు.

# క్యాన్సర్ నిర్మూలనకు కృషిచేస్తా : కౌశల్



పెదవాల్తేరు: మానసిక వికలాంగులకు అందరూ చేయూత ఇవ్వాలని బిగ్‌బాస్-2 విజేత కౌశల్ కోరారు. నగరంలోని పెదవాల్తేరులో గల హిడెన్స్ స్పోట్స్ మానసిక వికలాంగుల పాఠశాల లో తెలుగుదేశం పార్టీ నగర ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానసిక వికలాంగులకు అన్నదానం చేయడం ఆనంద కరంగా ఉందన్నారు. టీడీపీ ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి మాట్లాడుతూ తన స్నేహితుడు కౌశల్ చేతులమీదుగా అన్నదానం నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కౌశల్ మట్లాడుతూ కౌశల్ ఆర్మీని మరింత విస్తరిస్తానని, విజయవాడ, బెంగుళూరు వంటి నగరాలలో పర్యటించి కౌశల్ ఆర్మీ సభ్యులను కలుస్తానన్నారు. కౌశల్ ఆర్మీ తరుపున రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, అనాధలకు సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. తన తల్లి క్యాన్సర్‌తో పడిన బాధ వర్ణణాతీతం అని బిగ్‌బాస్ ప్రైజ్‌మనీ రూ. 50 లక్షలతోపాటు క్యాన్సర్ రోగుల వైద్యానికి తన స్వంత నిధులు ఖర్చుచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెంచూరియన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ బిగ్‌బాస్ కార్యక్రమంద్వారా కౌశల౦ ఎంతోమంది అభిమానులను సంపాంధించుకున్నారని ప్రశంసించారు.

# గుజ్జు మురళీకృష్ణారెడ్డి మరణించడం టిడిపికి తీరనిలోటు

## వాసుపల్లి గణేష్‌కుమార్



విశాఖపట్నం: విశాఖ అర్బన్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయ కమిటీ 14వ డివిజన్ టిడిపీ అధ్యక్షులు గుజ్జు మురళీకృష్ణారెడ్డి సంతాప సభలో విశాఖ అర్బన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులు గుజ్జు మురళీకృష్ణారెడ్డి మరణం పార్టీకి తీరని లోటని, ఆయన పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు. వారి కుటుంబానికి పార్టీ తరపున ప్రగాడ సానుభూతి తెలియజేస్తూ పార్టీ తరపున వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేయుటకు నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ గుజ్జు మురళీకృష్ణారెడ్డి గూర్చి మాట్లాడుతూ కన్నీటి పర్వంతం అయ్యారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నజీర్, రాజమండ్రి నారాయణ, అన్నమరెడ్డి వాణి, పైలా ముత్యాల నాయుడు, ఇమ్మంది రమణ, బండారు అప్పారావు, మేకా సత్యకిరణ్, అక్కిరెడ్డి జగదీష్, ఈతలపాక సుజాత, గొర్లె అప్పారావు, గొర్లె నాగమణి, వేణుగోపాల్, విప్పర్ల రాఘవమ్మ, బొడ్డేటి మోహన్, కొట్ర కన్నారావు, వాసుపల్లి రాజు, ఈసరపు వెంకట లక్ష్మి, కనకేష్, బత్తుల సంజీవనాయుడు, పాలిశెట్టి అప్పన్న, ముక్కా కిషోర్, ఎస్‌కె బాబ్జి, గంట్యాడ ఆదినారాయణ, వవివి. ఆదినారాయణ, అధికసంఖ్యంలో పార్టీ కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# బాబుది 'చెత్త' పాలన







### మొదటి పేజీ తరువాయి

హామీ ఏమైందని ప్రశ్నించారు. జగన్ చీపురుపల్లి దాటాడని తెలిసిన తర్వాత గైనకాలజిస్టును నియమించారు. పిల్లల డాక్టరు లేరు. బ్లడ్ బ్యాంకు లేదు. మార్చురీలో ఫ్రీజర్లు లేవు. జనరేటర్ పనిచేయదు. అంబులెన్సులు లేవు. ఇలా అయితే పేదవారికి వైద్యం ఎలా అందుతుందంటూ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

**108 వాహనాల కొనుగోలులో అడ్డగోలు అవినీతి**

రాష్ట్రంలో వాస్తవంగా 310 అంబులెన్సులు(108 వాహనాలు) ఉంటే.. సీఎం దగ్గర ఉన్న కోర్ డ్యాష్ బోర్డులో మాత్రం 414 వాహనాలు తిరుగుతున్నాయంటూ లెక్కలు చూపిస్తున్నారని జగన్ అన్నారు. అలాగే ఒక్కో వాహనం కొనుగోలు చేయడానికి టాటా



కంపెనీ 12.60 లక్షలు కోట్ చేస్తే.. చంద్రబాబు మాత్రం 18 లక్షల రూపాయలు చెల్లించి తన బినామీలకు లబ్ది చేకూరుస్తున్నారని జగన్ ఆరోపించారు. పక్క రాష్ట్రం తెలంగాణలో 11 లక్షల 65 వేలకే 108 వాహనం కొనుగోలు చేస్తుంటే.. బాబు ఇంత మొత్తం ఖర్చు చేయడం ఆయన అవినీతికి నిదర్శనమన్నారు. ఆఖరికి 108 వాహనాల డీజిల్‌కు కూడా చెల్లించాల్సిన డబ్బుల విషయంలో కూడా చంద్రబాబు స్కాం చేయడం సిగ్గుచేటని జగన్ విమర్శించారు.

**వైఎస్ జగన్ సమక్షంలో 200 టీడీపీ కుటుంబాల చేరిక**

ప్రజాసంకల్పయాత్రలో ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో టీడీపీకి చెందిన 200 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వారితో పాటు స్థానిక టీడీపీ నేత పైడిరాజు కూడా వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి వైఎస్ జగన్ సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన పైడి రాజు మాట్లాడుతూ.. అధికార తెలుగుదేశం పార్టీ స్థానిక ఎమ్మెల్యే కేఏ నాయుడు అరాచకాలు ఎక్కువయ్యాయని, సీనియర్ నాయకుల పట్ల వివక్ష కారణంగా టీడీపీకి రాజీనామా చేశామని వెల్లడించారు. కనీసం అర్హులైన వారికి పింఛన్లు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన నవరత్నాలకు ఆకర్షితులమై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరామని పైడిరాజు తెలిపారు.

తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని, ఎన్నికల ముందు ఎమ్మెల్యే కేఏ నాయుడు హామీ ఇచ్చారని, నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోలేదని గజపతినగరం మండలం మల్లునాయుడు వలస గ్రామ మహిళలు జగన్ మోహన్ రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే తమ కష్టాలు తీరుతాయని పార్టీలో చేరిన మహిళలు ఆశాభావం వ్యక్తం చేశారు.

అలాగే వైఎస్ జగన్‌ను గజపతినగరం మండలం జిన్నాం గ్రామానికి చెందిన మహిళలు, పాఠశాల విద్యార్థినులు కలిశారు. పింఛన్లు రావడం లేదని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ కాలేదని వారు వైఎస్ జగన్ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. తమ స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం, మరుగుదొడ్ల సౌకర్యం లేనందువల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ఊర్లో ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న యువకులు తాగి ఇబ్బంది పెడుతున్నారని, వారికి ఉద్యోగాలు కల్పిస్తే బయట ఊళ్లకు వెళతారని, దాంతో తమ ఇబ్బందులు తొలగిపోతాయని స్కూలు బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు.

**జగన్‌కు అడుగడుగునా సమస్యలు ఏకరువు**

విజయనగరం జిల్లాలోని గజపతినగరంలో ప్రజా సంకల్ప యాత్ర రెండవరోజు ఉదయం 9 గంటలకు జిన్నాం గ్రామం నుండి ప్రతిపక్ష నేత, వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదయాత్ర లింగాలవలస, కొత్తశ్రీరంగరాజపురం గ్రామం మీదుగా ఎన్.జి.ఆర్.పురం గ్రామానికి మధ్యాహ్నానికి చేరుకుంది. మధ్యాహ్నం భోజనం అనంతరం విశ్రాంతి తీసుకున్న అనంతరం యాత్రను గజపతినగరం మీదుగా స్థానిక నాలుగు రోడ్లుకు చేరుకున్నది. ఈ పాదయాత్రకు గ్రామాల్లోని ప్రజలు ఘనస్వాగతం పలకడంతో పాటు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. దారిపొడవునా గ్రామస్తులు స్వాగతం పలుకగా ప్రతి ఒక్కరిని పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. లింగాలవలసలోని రైతులు, మహిళలను పలకరించి సమస్యలను తెలుసుకున్నారు. కొంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఉద్యోగులు వినతిపత్రాన్ని జగన్‌కు అందజేశారు.

అలాగే వైకాపా రాష్ట్ర నాయకుడు సినీనటుడు విజయ్‌చందర్ జగన్‌ను కలవడానికి రాగా ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు సామంతుల పైడిరాజు పార్టీలో చేరగా పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తోటపల్లి కాలువ ద్వారా నీటిని లింగావలస వరకు ఇచ్చే ప్రతిపాదన ఉన్నప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయని కాలువ త్రవ్వకం పనులు త్వరితగతిన చేపట్టి సాగునీరు అందించాలని రైతులు జగన్‌ను కోరారు.

కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, జిల్లా రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ గార తవుడు, మాజీ ఎఎంసి చైర్మన్ పల్లి సంజీవరావు, మాజీ సర్పంచ్ మండలసురేష్ తదితరులు పాల్గొన్నారు.



---

## బీచ్‌ను అభివృద్ధి పరిస్తే
# స్మార్ట్ సిటీ అయిపోతుందా?


**విశాఖ చరిత్రకు ఆనవాళ్లయిన జాలారిపేట పరిస్థితి దయనీయం**

**అడుగడుగునా ప్రజా సమస్యలు.. పట్టించుకొనే నాథుడే లేడా?**

**రావాలి జగన్.. కావాలి జగన్.. ఇంటింటికీ నవరత్నాలు కార్యక్రమంలో డాక్టర్ పివిఆర్ ఆవేదన**



పూర్ణామార్కెట్: దేశంలోనే నెంబర్ వన్ స్మార్ట్ సిటీగా విశాఖపట్నం రూపాంతరం చెందిందంటూ ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పుకుంటున్నారని, సాగర తీరం రంగుల మయం చేస్తే స్మార్స్ సిటీ అయిపోదని, మురికి వాడలను కూడా అభివృద్ధిపరిచిన నాడే స్మార్ట్ సిటీకి అర్థముంటుందని విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రావాలి జగన్.. కావాలి జగన్ జగనన్నకు తోడుగా ఇంటిఇంటికి నవరత్నాలు కార్యక్రమం వార్డు అధ్యక్షుడు ఎన్. పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా వైస్సార్సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి హాజరై 22వ వార్డు 144 , 148, 159 బూత్‌లు



మీ కుటుంబంలో సభ్యుడినౌతానంటూ జగనన్న నవరత్నాలు గురించి వివరిస్తున్న డా. పివిఆర్.

గల ఏరియాలలో జబ్బార్ తోట, చందరిపేట, గాంధీబొమ్మ ఏరియా, పొట్టి శ్రీరాములు సంఘం తదితర ప్రాంతాల్లో ఇంటి ఇంటికి వెళ్లి జగన్ నవరత్నాలు పై అవగాహన కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ కొన్ని శతాబ్దాల చరిత్రకు ఆనవాళ్లయిన విశాఖ వన్‌టౌన్, జాలరిపేట, తదితర ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంగా ఉంటూ, కనీస మౌలిక వసతులకు కూడా నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రాంతంలోని గంగపుత్రులైన మత్సకార కుటుంబాలు దయనీయ పరిస్థితిలో గడుపుతున్నాయని, వృద్ధులు కాలుష్యం బారినపడి తీవ్ర అనారోగ్యాలకు గురౌతున్నారని, కాలుష్య నివారణకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు శూన్యమని డాక్టర్ పివిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న నవరత్నాలతోనే ఈ సమస్యలు పరిష్కారం జరుగుతాయని,రానున్న రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలంతా ఆశీర్వదించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జాన్ వెస్లీ, మైనారిటీ విభాగం నాయకులు షరీఫ్, లండ రమణ ,26వ వార్డు అధ్యక్షుడు కనకారెడ్డి, 22వ వార్డు నాయకులు మొల్లి చంటి, ఎం సతీష్ ,వినోద్, సింగ్, తాతజి, నగేష్, సీహెచ్ రాజు, మహిళ నాయకురాలు యల్లయమ్మ, వాసుపల్లి నరేష్, టి. కుమార్ మరియు అధిక సంఖ్యలో మహిళలు యూత్ పాల్గొన్నారు.

---

# బాబు ప్రజలను మోసం చేశారు

**- రాజన్నను గెలిపించండి.. రామరాజ్యం స్థాపించండి**

**- త్వరలో నూతన శకం ఆరంభం అవుతుంది**

**- వైకాపా రాష్ట్ర నాయకుడు, సినీనటుడు విజయ్‌చందర్**



విజయనగరం: చంద్రబాబు ప్రజలను మోసం చేశారని త్వరలో నూతన శకం ఆరంభమౌతుందని ప్రసిద్ధ సినీనటులు విజయచందర్ అన్నారు. యువనేతలు రాబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంఎల్‌సి కోలగట్ల వీరబ్రధ్రస్వామి కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోశ్యం చెప్పారు. రాష్ట్రంలో 125 సీట్లు గెలుచుకుంటుందని అన్నారు. జగన్‌పాదయాత్రతో రాష్ట్రంలో మార్పులు కన్పించాయని అన్నారు. ప్రతిపక్షనేతగా పవన్ ఉండాలని అభిలాషించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రచార కమిటి అధ్యక్షులు మహంతి కృష్ణమోహన్, యువజన విభాగం అధ్యక్షులు సంగంరెడ్డి బంగారునాయుడు, యువనేతలు గుడిశ ఋశ్వరకౌషిక్, ప్రచారకమిటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరిరమణమూర్తి, ప్రసన్నకుమార్, బి.సి సెల్ కార్యదర్శి బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

---

# రాయబరేలి మృతులకు కేంద్రం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

రాయబరేలి: యూపీలోని రాయబరేలిలో ఇవాళ ఉదయం సంభవించిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్ రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీనికి అదనంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రూ.2 లక్షల చొప్పున మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కాగా, రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి లక్ష రూపాయలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50,000 అందజేయనున్నట్టు గోయల్ ప్రకటించారు. యోగి ఆదిత్యనాథ్ సైతం తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ.50,000 పరిహారం ప్రకటించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయాల్సిందిగా రైల్వే సేఫ్టీ కమిషన్‌కు గోయల్ ఆదేశించారు. బుధవారం ఉదయం రాయబరేలిలో న్యూ ఫరక్కా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన తొమ్మిది బోగీలు పట్టాలు తప్పడంతో ఏడుగురు మృతిచెందారు. 21 మంది గాయపడ్డారు. రైలు ఖాళీ చేయించి ప్రయాణికులను తీసుకువెళ్లేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్టు నార్తరన్ రైల్వే డివిజనల్ మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. లక్నో, వారణాసి నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. లక్నో నుంచి వైద్యుల బృదం, రిలీఫ్ మెడికల్ వ్యానును కూడా రంగంలోకి దింపారు.

---



*గోలుగుల రాము మెమోరియల్ ఫూట్ బాల్ క్లబ్ , వెలంపేట , విశాఖపట్నం 30 మంది క్రీడాకారులకు ఫూట్ బాల్ ట్రాక్ సూట్స్ ను కళా హాస్పిటల్ తరుపున అందజేస్తున్న కళా హాస్పిటల్ అధినేత , విశాఖ వైయస్ఆర్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి*

---

# క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయండి

**బూత్ కన్వీనర్ల సమావేశంలో డాక్టర్ పివిఆర్**



*వైయస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 27, 30 వార్డుల బూత్ స్థాయి కన్వీనర్ల సమావేశంలో పాల్గొన్న దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి*

ద్వారకానగర్: నియోజకవర్గంలోని అన్ని బూత్‌ల కన్వీనర్లు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సన్నాహాలు సిద్ధం చేసుకోవాలని దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బూత్ కన్వీనర్ల సమావేశం బుధవారం స్థానిక సౌత్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 15, 27, 30వ వార్డుల బూత్ కమిటీల కన్వీనర్లు హాజరయ్యారు. అనంతరం బూత్ కన్వీనర్ల నుద్దేశించి డాక్టర్ పి.వి. రమణ మూర్తి మాట్లాడుతూ బూత్ పరిధిలో ఉన్న అన్ని వీధి, ఏరియాలలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని స్నేహపూర్వకంగా మెలగాలని అన్నారు. ఓటర్ల నమోదు, చిరునామా మార్పు తదితర ఓటర్లను గుర్తించి తక్షణమే వారికి తగు సహాయాన్ని అందించాలని తెలియజేశారు. బూత్ స్థాయిలో ఒక్కొక్క బూత్ కన్వీనర్ 30 మంది నాయకులను తయారు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ఆహార భద్రత కమిషన్‌తో
# సిఆర్‌పిఎఫ్ భేటీ



విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలతోపాటు విశాఖ జిల్లాలో బాలలకు, పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార లోటుపాట్లను తదితర బాలల సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎదురౌతున్న అంశాలను రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ జె.ఆర్.పుష్పరాజ్, సభ్యుడు ఎల్. వెంకటరావుల తో బుధవారం సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర అద్యక్షుడు గొండు సీతారాం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం మాట్లాడుతూ తాము ఫుడ్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చిన ప్రతీ అంశాన్ని సంబంధిత శాఖాధికారుల మధ్య చర్చించారన్నారు. కమిషన్‌తో రాష్ట్రంలో బాలలకు సమ న్యాయం జరుగుతున్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కమిషన్ చైర్మన్, సభ్యులను కలిసిన వారిలో ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు తిర్లంగి హరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి. శకుంతల, ప్రధాన కార్యదర్శి జివి కుమార్, సభ్యులు వి. హేమసుందర్, లక్ష్మణ రెడ్డి, కె. ఎల్లయ్య, పి. శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### టిట్లీ పట్ల ప్రజలు
## అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు మంత్రి ఆదేశాలు

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన మంత్రి గంటా



విశాఖపట్నం: టిట్లీ తుఫాను నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఆకస్మికంగా కలక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి సందర్శించారు. ఈ తుఫాను నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టంగా జరుగకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. రిలీఫ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య బృందాలను కూడా ఆయా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. టిట్లీ తుఫాను ప్రభావం ఏ మేరకు జిల్లాపై ఉంటుందనే విషయాన్ని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ మంత్రికి వివరించారు. జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉందని, రౌండ్ ది క్లాక్ ఉద్యోగులు అంతా క్షేత్ర స్థాయిలోనే పనిచేస్తున్నారని మంత్రికి వివరించారు. అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేశామని తెలిపారు.

# అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే

- అందుకే అమ్మను ఆరాధించాలి
- పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి
- ఘనంగా శారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



పెందుర్తిః అమ్మ దయ కావాలంటే అమ్మను అందరూ చల్లని మనస్సులో ఆరాధించాలని షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి ఉద్బోధించారు. బుధవారం పీఠ ప్రాంగణంలో మహాస్వామి ఆధ్వర్యంలో ఉత్తర పీఠాధిపతి బాలస్వామి సమక్షంలో శారదా శరన్నవరాత్రి మహోత్సవములు గోపూజ, గురువందనంతో ఘనంగా ప్రారంభించబడ్డాయి. ఈ మహోత్సవాల ప్రారంభంలో గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలను శ్రీవారు ప్రారంభించారు. అనంతరం కలశ స్థాపన, మండపారాధన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వీటిని పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం పీఠ స్వర్ణమండపంలో గల అమ్మవారికి విశేష అభిషేకాదులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చండీహోమం, శ్రీచక్రార్చన వైభవంగా జరిపారు. ఈసందర్భంగా మహాస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ మనమందరం చల్లగా ఉండాలి అంటే అమ్మవారి దయ ఉండాలి. యావత్ ప్రపంచమంతా తల్లి నీడలోనే నడుస్తోంది. సకల జనులు, పశు పక్ష్యాదులు సుఖంగా ఉండాలంటే భగవతి కృప పరిపూర్ణంగా ఉండాలి. రైతులు ఆనందంతో ఉండాలి, పంటలు పచ్చగా ఉండాలి, లోకాలన్నీ క్షేమంగా ఉండాలంటే ఆ క్షేమంకరిని పూజిస్తే శుభం జరుగుతుందని అన్నారు. అభయంకరి కరుణా కటాక్షాల కోసం చండీహోమం, శ్రీచక్ర నవావరణార్చనలు, అమ్మవారికి హరిద్రాది అభిషేకములు, విశేష అలంకరణ, అర్చనలు లోకకల్యాణార్థం జరిపిస్తూ అమ్మవారికి ఏకాదశ హారతులు కూడా ఇవ్వడం జరుగుతోందని మహాస్వామి పేర్కొన్నారు. అనంతరం అశేషంగా తరలి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదములను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు ఆర్. శ్రీనివాస్, చల్లా రామారావు, ధర్మాధికారి కామేశ్వర శర్మ, వ్యాపారవేత్త, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత తిరుపతిరెడ్డి మరియు శవశక్తి టౌన్‌షిప్ అధినేత వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. శారదా నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 15న ఉదయం 9 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం మరియు విద్యార్థినీ విద్యార్థులచే సరస్వతీ పూజ నిర్వహించబడునని స్వామీజీ తెలిపారు.



శ్రీ శారదా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీచరణులను దర్శించి మహా స్వామి వారి ఆశీస్సులు పొందుతున్న బిగ్‌బాస్ విన్నర్ కౌశల్ మరియు కుటుంబ సభ్యులు. చిత్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ జనరల్ సెక్రటరీ బొడ్డేటి అనూరాధ, జనసేన ఉత్తర నియోజకవర్గం నాయకుడు డాక్టర్ బొగ్గు శ్రీను, తదితరులు

## 15 అసెంబ్లీ సీట్లు ఇస్తే..
# బాబూ మీరేం చేశారు?

- చంద్రబ్రాబు పాలన అంతా అవినీతి మయం

- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



ఏలూరు: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యలను గాలికొదిలేసి స్వార్థ ప్రయోజనాల కోసం మాత్రమే పని చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ఈ నాలుగున్నరేళ్ల చంద్రబాబు పాలనలో దాదాపు రూ. 5 లక్షల కోట్లను విదేశాలకు తరలించారని ధ్వజమెత్తారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించిన విజయసాయిరెడ్డి.. చంద్రబాబు పాలన అంతా అవినీతి మయంగా తయారైందన్నారు. ప్రధానంగా పశ్చిమలో 15 అసెంబ్లీ సీట్లను ప్రజలు ఇస్తే.. అసలు జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. అన్ని సీట్లు ఇస్తే రౌడీ ఇజాన్ని, ఇసుకదందాని టీడీపీ ఎమ్మెల్యేలతో చేయిస్తున్నా రన్నారు. ద్వారకాతిరుమల వెంకన్నసాక్షిగా చంద్రబాబు ప్రమాణం చేసి పశ్చిమకు ఎంత న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కొల్లేరు విషయంలో స్వార్థ ప్రయోజనాలే తప్ప ప్రజల కోసం మాత్రం ఏమీ చేయలేకపోయారని విమర్శించారు.

పశ్చిమలో 15 అసెంబ్లీ సీట్లు ఇస్తే మీరు జిల్లాకి ఏం చేశారు. అన్ని సీట్లు ఇస్తే రౌడీయిజాన్ని, ఇసుక దందాని మీ ఎమ్మెల్యేలతో చేయిస్తున్నారు. 2014లో డ్వాక్రా మహిళలతో చంద్రబాబు సన్మానం చేయించుకున్నారు. కానీ వారికి రుణమాఫి మాత్రం చేయలేకపోయారు. నాలుగున్నరేళ్ళల్లో సుమారు రూ. 5 లక్షల కోట్లు విదేశాలకి తరలించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు విదేశాలలో దాచుకున్న అక్రమార్జనను వెనక్కి రప్పిస్తాం. ఎన్నికల తర్వాత చంద్రబాబు, ఆయన తనయుడు విదేశాలకు పారిపోకుండా వారి పాస్ పోర్ట్ లు సీజ్ చెయ్యాలి. రాష్ట్ర విభజనకి కారణం కాంగ్రెస్. దానికి సహకరించిది టీడీపీ. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ కలయిక అనైతికం. ఐటి సోదాలంటే చంద్రబాబు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే ఐటి సోదాల సమయంలో పోలిసులను పంపకూడదని క్యాబినెట్‌లో ఎందుకు నిర్ణయం తీసుకున్నారు. నాలుగున్నరేళ్ళు కేంద్రంతో జతకట్టి ఇపుడు సహకరించడంలేదంటూ చంద్రబాబు లేఖ రాస్తాననడం హస్యాస్పదం అని విజయసాయి రెడ్డి విమర్శించారు.

ప్రజలకు మంచి పాలన అందించాలనే ఉద్దేశంతోనే తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రను చేపట్టారన్నారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని అధికారంలోకి రాగానే సుపరిపాలనే అందించాలనేది తమ పార్టీ ఉద్దేశమన్నారు. తండ్రికి మించిన తనయుడిగా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలనేదే జగన్ ఆశయమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. టీడీపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, వారు పడుతున్న ఇబ్బందులను జగన్ దృష్టికి నేరుగా తీసుకువస్తున్నారని ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. అధికార టీడీపీలో అవినీతి, బంధుప్రీతి పెరిగిపోయిందన్నారు.






# మార్కెట్లకు లాభాల కళ

ముంబయి: దేశీయ సూచీలు నేడు భారీ లాభాలతో ముగిశాయి. రూపాయి బలపడడం, ఆటో, లోహ, బ్యాంకింగ్ తదితర రంగాల షేర్లు లాభాలను నమోదు చేయడంతో మార్కెట్లు పరుగులు పెట్టాయి. దేశీయ మదుపర్లు నుంచి కొనుగోళ్లు పెరగడం ఇందుకు తోడైంది. ఈ నెల 11న ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేయడం ద్వారా వ్యవస్థలోకి మరో రూ.12వేల కోట్ల నిధులు అందబాటులోకి తెస్తామని ఆర్బీఐ నిన్న ప్రకటించడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది.

ఉదయం సెన్సెక్స్ వంద పాయింట్లకు పైగా లాభంతో ప్రారంభం కాగా, నిఫ్టీ 10,300పైన ట్రేడయ్యింది. ఆద్యంతం లాభాల్లో కొనసాగిన సూచీలు ముగింపు సమయంలో మరింత లాభాలను ఆర్జించాయి. సెన్సెక్స్ 461.42 పాయింట్ల లాభంతో 34760.89 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 159.05 పాయింట్ల లాభంతో 10,460.10 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.74.17 వద్ద ట్రేడవుతోంది.

ఎన్ఎస్ఈలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ సర్వీసెస్, యాక్సిస్ బ్యాంకు, జీ ఎంటర్‌టైన్ తదితర కంపెనీలు లాభపడ్డాయి.


LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750







VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com